# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్ స్వర్ణముఖి

VOLUME 32 ISSUE 7
No. OF PAGES 40
MARCH 2013

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M
చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన
చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

***ఈ సంచికలో*** ............................. ....... **పేజీ**

భద్రవాక్యం 2
యోగి వేమన 3
శ్రీబాబూజీ ఉవాచ 4
శ్రీమాతాజీ అభిభాషణ 6
సన్నిధిలో సంభాషణ 10
శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు 12
యోగవాశిష్ఠము 13
గురు కృపాహి కేవలమ్ 15
శ్రీమాతాజీతో యూరప్ యాత్ర 17
సమర్థసద్గురు యాజమాన్యం వివరాలు 19
శ్రీకృష్ణ కర్ణామృతం 20
పరిప్రశ్నేన సేవయా 22
ఏది గొప్ప? 23
స్థిత ప్రజ్ఞుడు 24
ఈ జన్మలోనే దైవదర్శనం 26
భగవంతుని ఆశీర్వదించిన ఆళ్వారు 28
భగవంతుడి ఉనికి 29
సత్యశోధన 31
చందాదారులకు విజ్ఞప్తి 33
శ్రీసద్గురు రజతోత్సవ వేడుకలు 34
సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర 35
శ్రీరాధామాధవ రస సుధ 37
విష్ణు కథలు 38

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

ఏకఏవహి భూతాత్మ భూతేభూతే వ్యవస్థితః ।
ఏకధా బహుధాచైవ దృశ్యతే జలచన్ద్రవత్ ॥

(అమృత బిందూపనిషత్)

ప్రతిప్రాణియందు ఉన్న ఆత్మవస్తువు ఒక్కటే. కాని నామరూపములు, క్రియా గుణాలు వేరుగా గోచరించవచ్చు. నిజానికి నీవు బాగున్నావా? అని ప్రశ్నించినా, సమాధానం 'నేను' గురించే వస్తుంది. నీవు అనే పదార్థం లేదు. నేను అనే పదార్థమే ఉంది. అందువలన నేను బాగున్నాను అన్న సమాధానమే వస్తుంది. భాషా ప్రయోగంలో యితరులందరిని ద్వైతపరంగా 'నీవు' అని, తనని మాత్రం అద్వైతపరంగా 'నేను' అని సామాన్య మానవులందరూ వ్యవహరించటం గమనించదగినది.



అయితే సామాన్యులు యదార్థాన్ని గుర్తించి భాషా ప్రయోగం మాత్రమే చేస్తున్నారా? అన్నది వివాదాంశము. అలా గుర్తించాలన్నది యదార్థ విషయం. డాక్టరు దగ్గరకి వెళ్ళి నాకు అనారోగ్యంగా ఉంది మందు యిమ్మంటే దేహానికి మందిస్తాడు కాని 'నేను'కు కాదు. నేనుకు నొప్పిలేదు. మరి నొప్పి ఎవరికి? 'నేను'ను గుర్తించటానికి కలిగన అవరోధమే నొప్పి అని గ్రహించాలి.

కదలని నీటిలో చంద్రబింబం ఒక్కటే కనిపిస్తుంది. కదిలే నీటిలో చంద్రబింబం కదులుతూ కనబడుతుంది. కదలికల వలన అనేక బింబములు ఉన్నట్లుగా గోచరించవచ్చు. కాని నీటికి ఆవల నిశ్చల స్థానంలో చంద్రుడు ఉన్నాడు. చలించే నీటిలో కనిపించేది చంద్రుని ప్రతిబింబమే.

చంచలమైన మనస్సు నిశ్చలమైన ఆత్మని చంచలంగా గోచరింపజేస్తుంది. మనస్సు ద్వారా దర్శించేది ఆత్మయొక్క ప్రతిబింబమే. జగత్తు జీవితం అన్వేషణకి ఆత్మ ఒక్కటిగా, అనుభవానికి మాత్రం అనేకంగా గోచరింపజేస్తూ దోబూచులాడటం సామాన్య మానవుని స్థితి. కాని సద్గురుమూర్తిని ఆశ్రయించిన సాధకుడు ఉపనిషత్తు వాక్యంలోని ఆంతర్యాన్ని గ్రహించి సాధనలో పురోగమించ గలుగుతాడు.

*

# యోగి వేమన

గత సంచిక తరువాయి

- శ్రీ బులుసు వెంకటరమణయ్య

23. ఓగునోగు మెచ్చు నొనరంగ నజ్ఞాని
భావమిచ్చి మెచ్చుఁబరమలుబ్ధుఁ
బంది బురదమెచ్చుఁ బన్నీరు మెచ్చునా?
విశ్వదాభిరామ! వినురవేమ.

తాత్పర్యము -

చెడ్డవాడు చెడ్డదానినే మెచ్చుగాని, మంచిదాన్ని మెచ్చుకొనడు. అజ్ఞాని లుబ్ధునే మెచ్చును. ఎట్లనగా పందికి బురదయే యిష్టమైనది. పన్నీరుపై దానికి యిష్టముండదు.



24. ఓగుబాగెఱుఁగక యుత్తమూఢజనంబు
నిల సుధీజనముల నెంచఁజూచు
కరినిగాంచి కుక్క మొఱిగిన సామ్యమౌ
విశ్వదాభిరామ! వినురవేమ.

తాత్పర్యము -

మూర్ఖులు మంచి చెడ్డలు గమనింపక బుద్ధిమంతులను లక్ష్యము చేయరు. దాని వలన నష్టమేమి? ఏనుగు వెనుక కుక్క మొరిగిన ఏనుగుకు నష్టమేమున్నది?

25. ఔనటంచు నొక్కఁడాడిన మాటకు
కాదటంచుఁ బలుక క్షణము పట్టు
దాని నిలువఁదీయఁ దాతలు దిగివచ్చు
విశ్వదాభిరామ! వినురవేమ.

తాత్పర్యము -

ఒకడు 'ఔను' అను దానిని మరొకడు 'కాదు' అని వెనువెంటనే చెప్పవచ్చును. కాని, దానిని సమర్థించుట మిక్కిలి కష్టము.



# శ్రీబాబూజీ ఉవాచ

– పరాశర ప్రసాద్

సాధకులైన వారికి సందేహాలు కలగడం సహజం. కానీ వారికి కలిగిన సందేహాలను తీర్చగల సమర్థుడు సద్గురుమూర్తి మాత్రమే. మనస్సులో సందేహాలు పెట్టుకుని మధన పడడం కన్న వాటిని గురుదేవులకు విన్నవించి నివృత్తి చేసుకోవడం సరైన మార్గం. అటువంటి సాధకులను శ్రీ బాబూజీ మహరాజ్ చాలా గౌరవించే వారు. 'మనస్సు ఎన్నడూ దాయరాదు. గురుమూర్తి సమక్షంలో మనస్సు విప్పి మాట్లాడాలి' అని హెచ్చరించే వారు శ్రీ బాబూజీ మహరాజ్. కొందరు మహాత్ములు విశిష్టాద్వైత్వాన్ని బోధిస్తున్నారు. మరికొంతమంది అద్వైతసిద్ధి పొందిన వారికే మోక్షార్హత అని అంటున్నారు. కొంతమంది మహాత్ములు సన్యసించనిదే మోక్షం పొందడం అసాధ్యమంటున్నారు. ఇటువంటి అభిప్రాయాలను విన్న మావంటి సాధకులకు పరిష్కారమార్గం సూచించమని కోరిన భక్తులకు బోధ చేస్తూ శ్రీ బాబూజీ మహారాజ్ "కాషాయదండ మాత్రేన యతిఃపూజ్యోనసంశయః" అని చెప్పబడిన విషయం మీ అందరికి తెలిసిందే కదా! సాధకులు తికమక పడవల్సిన పనిలేదు. కాషాయ వస్త్రాలు, రుద్రాక్షలు, కమండలం, దండం ధరించిన వారిని ఎవరైనా గౌరవిస్తారు. అందులో సందేహంలేదు. కానీ ఒక వ్యక్తి వేషధారణచేత సన్యాసి కాలేడు కదా! నిజమైన సన్యాసి అంటే ఎవరో మన గురుగీత వివరిస్తోంది.



విజావంతి మహావాక్యం
గురోశ్చరణ సేవయా తేనై సన్యాసినహః
ప్రోక్తా ఇతః వేషధారిణహః॥

దీని అర్థం ఏమంటే ఎవరైతే సమర్థులైన గురువుని ఆశ్రయించి, సేవచేసి, మహావాక్యోపదేశం పొంది వాటిని అనుభవ పూర్వకంగా తెలుసుకుంటారో వారే సన్యాసులు. మిగిలిన వారు సన్నాసులు. సద్గురుమూర్తిని ఆశ్రయించవచ్చు, సేవచేయవచ్చు. మహావాక్యోపదేశం పొందవచ్చు అంతమాత్రం చేత సన్యాసులు కారు. వాటిని అనుభవంలోకి తెచ్చుకున్నప్పుడే సన్యాసులు అని పిలువబడతారు. "అహం బ్రహ్మాస్మి" అన్నంతమాత్రం చేత బ్రహ్మకాలేడు కదా! అదిస్మరించే మంత్రం కాదు. తాను బ్రహ్మ అయినప్పుడు బ్రహ్మగానే ఉండాలి. పాలుపాలతోనే కలుస్తాయి గానీ, నీళ్ళలో కలవవుకదా! సన్యసించనిదే మోక్షప్రాప్తి కలుగదు అన్నది యదార్థమే. అందులో సందేహంలేదు. కాని సన్యాసి అంటే ఎవరో తెలుసుకోవాలి. మనస్సు సన్యసించాలి.

సన్యాసి అంటే విరాగి. అతనికి ఏరకమైన సంకల్పములు గానీ, గుణములుగానీ, వికారములుగానీ ఉండవు. ఆయనది సమదృష్టి, ఈర్ష్య, అసూయ, అసహనము, ఓర్వలేనితనము ఉండవు. ఆయనకు ఇది నీది, అది నాది అనే భావం ఉండదు. అంతా ఆయనదే. ఏదీ ఆయనది కాదు. దేహభావన ఉండదు. వేషభాషలకు అతీతుడు. ధూషణ, భూషణలకు అతీతుడు.

ఏ ఒక్క వ్యక్తిని నొప్పించి మాట్లాడడు ఆయన ఉన్నది మోక్షస్థితి. ఆయనకి భిన్నంగా మోక్షం అనేది లేదు అని అన్నారు శ్రీ బాబూజీ మహరాజ్. శ్రీ రామానుజుల వారు విశిష్ఠాద్వైతమును బోధించారు. దానిని తప్పుపట్టవల్సిన పనిలేదే! సాధకులు ఎవరైనా తాను నమ్మిన దైవాన్ని ఆరాధిస్తారు. అందులో తప్పులేదు కదా! విశిష్ఠాద్వైతమును ఆచరించే భక్తులు తమ మనస్సును భగవానుని యందు నిలిపి మైమరచిపోతే ఆస్థితిని ఏమంటారు. అలాగే అద్వైత సిద్ధాంతాన్ని నమ్మిన భక్తులు తాము నమ్మిన దైవాన్ని తమ మనస్సులో నిలుపుకొని మైమరచిపోతే ఆ స్థితిని ఏమంటారు? ఇంత తికమకలు, తలచిక్కు బేరాలు లేకుండా మీ మనస్సు భగవానుని యందు నిలిచినా, భగవానుడు మీ మనస్సులో నిలిచినా ఒక్కటే అని మీ హృదయబాబు హెచ్చరిస్తున్నాడు. దీనినే సమాధి స్థితి అంటారు.

సమాధి స్థితిలో బుద్ధి సమస్థితిలో ఉంటుంది. అక్కడ ప్రవృత్తికి స్థానం లేదు. ఎన్ని బోధలు విన్నా, ఎంతసేపు భగవన్నామ సంకీర్తనలో పాల్గొన్నా ఎన్ని పుణ్యకార్యాలు చేసినా, ఎన్ని దివ్య క్షేత్రాలు సందర్శించినా సన్యాసిఅనిపించుకోడు కదా! ఇవన్నీ సాధనలో పైకి ఎగబ్రాకడానికి ఉపకరిస్తాయి. ఇది మాత్రం సత్యం. మీరు చేసిన సాధన ఎన్నడూవృధాకాదు. మరికొంతమంది సాధకులు అప్పులబాధను భరించలేకనో, దారాపుత్రాదులను పోషించలేకనో కుటుంబసమస్యలను పరిష్కరించుకోలేకనో, సంసారసమస్యల విరక్తితోనూ సంసారాన్ని వదిలి ఏ అరణ్యానికో పోయి వేషధారణ మార్చి కాషాయవస్త్రాలు, కమండలం, రుద్రాక్షలు ధరించి దుర్భరమైన జీవితాన్ని గడుపుతారు. నిజమైన భక్తి , వైరాగ్యము తన సొంతము చేసుకోని వ్యక్తి ఎన్నడూ సన్యాసి కాలేడు. అతడు కేవలం సన్నాసి అవుతాడు. సమయానికి తనకి టిఫిను, భోజనం ఎవరు అందిస్తారా అని ఎదురు చూసే సన్నాసి జీవితం కన్నా, గృహస్థాశ్రమంలో ఉండి దారాపుత్రాదులను పోషించుకుంటూ, వారిలో దైవత్వాన్ని దర్శిస్తూ, భగవంతుని యందు విశ్వాసాన్ని పెంపొందించుకున్న భక్తుని కన్న నిజమైన సన్యాసి ఎవరు? మనస్సులో గురుమూర్తిని నిల్పుకొని, దేహాన్ని మరచి నిర్భయుడై సమాధిస్థితిలో ఉన్న వ్యక్తికి, మనస్సుని సద్గురుమూర్తి దివ్య చరణారవిందములపై నిలిపి దేహాన్ని మరచిన వ్యక్తికి, వ్యత్యాసము ఏముంది? అన్నారు గురుదేవులు.

*

గత సంచిక తరువాయి

# శ్రీ మాతాజీ అభిభాషణ

-జపమాలా ప్రసాద

తరువాత మహేంద్రవర్మ, సచ్చిదానందుడు ఆ రాత్రికి అడవిలో ఒక చెట్టుక్రింద విశ్రమిస్తారు. చలికి వణుకుతూ, ఆకలితో బాధపడుతున్న వారివురినీ, ఆ చెట్టుపైనున్న పక్షిజంట చూస్తాయి. అందులో మొగపక్షి ప్రక్కనే ఉన్న పల్లెలోకి వెళ్ళి, మండుతున్న కట్టెను ముక్కున కరచుకుని వచ్చి, చెట్టు క్రింద ఉన్న ఎండు కట్టెల మోపులో వేస్తుంది. దానితో చక్కని మంట తయారయి, రాజు, సన్యాసి చలి కాచుకుంటూ ఉంటారు. అంత ఆడపక్షి తన మగనితో "నాధా! వీరి చలిని తీర్చాము, కానీ పాపం ఆకలితో అల్లల్లాడుతున్నారు. నేను అగ్నిలో దూకితే నన్ను తిని వారు కడుపు నింపుకోవచ్చు కదా!" అని అగ్నిలో దూకేస్తుంది. అది చూసి మగపక్షి "నేను కూడా అగ్నిలో పడితే, వారిద్దరి కడుపులూ నిండుతాయి కదా!" అని, అదికూడా నిప్పులో పడిపోతుంది. "మన తల్లిదండ్రులు ఇద్దరూ వెళ్ళిపోయాక మనమెందుకు? మనని కూడా తింటే క్రింద ఉన్న వారి కడుపులు పూర్తిగా నిండుతాయి" అని అంటూ రెండు పిల్లపక్షులు కూడా అగ్నికి ఆహుతయిపోతాయి.



పక్షిభాష నెరిగి ఉన్న సచ్చిదానందస్వామి రాజు మహేంద్ర వర్మకి జరిగినదంతా చెప్పి "చూశారా మహారాజా! ఈ పక్షి కుటుంబం తమకున్నదంతా అతిధుల సేవకి వినియోగించడానికి సంశయించలేదు. ఇదీ నిజమైన గృహస్థ ధర్మం. తనకున్న దానిలో సందేహించకుండా త్యాగం చేయడం గృహస్థ ధర్మం. కనుక సన్యాసాశ్రమం, గృహస్థాశ్రమం రెండూ గొప్పవే" అని నిరూపించాడా సన్యాసి.

జనకుడు జ్ఞానానికి ప్రతీక. కానీ, రాజ్యం ఏలలేదా? అణువణువులో వున్న ప్రజ్ఞ తానని గుర్తించాడు. నేను కూర్చున్నాను, నేను వ్రాస్తున్నాను, నాకు వాంతులయ్యాయి అని అంటున్నాము. ఇవన్నీ ఎవరు గుర్తిస్తున్నారు? 'తాను' గుర్తిస్తున్నాడు. 'తాను' అంటే తనువు (శరీరం) కాదు. 'ఆత్మ'. అదే గురుమూర్తి మనకి నేర్పుతున్నది. సాధన చతుష్టయ సంపత్తి కలిగి ఉండి గురువుని ఆశ్రయించాలి.

మాటిమాటికి సాధన చతుష్టయ సంపద అంటారు మాతాజీ అనుకుంటున్నారు కదా? అది ఏమిటి అని ఎవరైనా అడిగారా? మీరు అడగకపోయినా చెప్పవలసిన ధర్మం మాకున్నది. ఎందుకంటే అదే మనం సంపాదించ వలసిన నిజమైన సంపద. సంయక్ పదానికి అంటే ఆత్మపదానికి తీసుకువెళ్ళే సంపద అది.

సాధకుడయినవాడికి కలిగి ఉండవలసిన ఈ సంపదలో మొదటిది 'నిత్యానిత్య వస్తు వివేకము'. మనం చూస్తున్న ప్రతిదానిలోను ఏది నిత్యము ఏది అనిత్యము. ఏది సత్యం, ఏది అసత్యం అని విచారించుకుంటూ ఉండాలి. ఈ భోగభాగ్యాలు నిత్యమా? ఈ శరీరం నిత్యమా? ఈ మేడలు మిద్దెలు నిత్యమా! ఇలా ప్రశ్నించుకుంటూ వెళితే ఇవన్నీ అనిత్యమే అని తేలుతుంది. 'మరి నిత్యమైనది ఏది?' అనే ప్రశ్న వస్తుంది. సత్యమైనది, నిత్యమైనది ఆత్మవస్తువు. అదెక్కడ ఉంది? ఎలా ఉంది? దీనినే 'ఆత్మ-అనాత్మ' విచారణ అని కూడా అంటారు.

ఇలా విచారణ చేయగా చేయగా, శాశ్వతం కాని వస్తువులయందు విరాగం ఏర్పడుతుంది. ఇదే సాధన చతుష్టయంలోని రెండవది అయిన 'ఇహ-అముత్ర అర్థఫలభోగ విరాగము'. 'ఇహ' అంటే ఈ లోకంలోని, 'అముత్ర' అంటే పరలోకంలోని సుఖాలయందు కూడా వైరాగ్యం కలిగి ఉండటం అన్నమాట. మనకీ లోకంలో ఉన్న సుఖాలకంటే పరలోక సుఖాలు వందింతలు లేక కోటింతలు ఎక్కువ ఉండవచ్చు. కానీ అవి కూడా "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి" అని గీతాచార్యుడు చెప్పినట్లు మనం చేసుకున్న పుణ్యం అయిపోగానే మనని క్రిందకి తోసేస్తారు. దీనికే గురుమహరాజ్ ఈ విధంగా చెప్పేవారు "మనం ఎంత ఫైవ్‌స్టార్ హోటల్‌కి వెళ్ళినా. ఎంతకాలం ఉండనిస్తారు? మనజేబులో పులితలకాయ నోట్లు (డబ్బు) ఉన్నంత వరకేగా? ఆ తరువాత మెడపెట్టి బయటకి గెంటేస్తారు." కనుక నిజమైన సాధకుడు ఇటువంటి సుఖాలని వాంతి చేసుకున్న అన్నంలా చూడాలని వేదాంతం చెబుతోంది.

ఇక ఈ సంపత్తిలోని మూడవది 'శమాది షట్క సంపత్తి'.

శమాది షట్క సంపత్తిలో

1) శమము - అంటే అంతరింద్రియాలైన మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారాలని నిగ్రహించడం.

2) దమము: బాహ్యేంద్రియ నిగ్రహం. పాణి, పాదం, వాక్కు , ఉపస్థ, పాయువు అంటే పాణి, (చేయి), పాదం, (కాలు), వాక్కు (మాట), ఉపస్థ, (జననేంద్రియము), పాయువు (విసర్జన) చేసే ఇంద్రియం అనే 5 కర్మేంద్రియాలు మరియు చెవులు (శ్రవణేంద్రియములు), కళ్లు (చక్షురింద్రియములు) ముక్కు (ఘ్రాణేంద్రియము), నాలుక (రసనేంద్రియము) చర్మము (త్వగింద్రియము) అనే అయిదు జ్ఞానేంద్రియాలు కలిపి బాహ్యేంద్రియాలు అని పిలువబడుతున్నాయి వీటిని నిగ్రహించడం దమము.

3)ఉపరతి: ఆత్మ వస్తువు నందే మనస్సు నుంచి రమత చెందడం ఉపరతి.

4)శ్రద్ధ: ఆత్మవస్తువును పొంది తీరుతాను అనే శ్రద్ధ కలిగి వుండడం 'శ్రద్ధ'.

5)తితీక్ష: లక్ష్యార్థ సాధనలో ఎన్నిరకాలుగా పరీక్షలు వచ్చినా తట్టుకొని నిలబడి

వుండడం తితీక్ష. తితీక్షకి పరాకాష్ఠగా ఏకనాధమహరాజ్‌ని చెప్పుకోవచ్చు.

6)సమాధానము: ఏనాడయితే లక్ష్యార్ధసాధనలో పైన చెప్పినట్టు శ్రద్ధా తితీక్షలు ఉంటాయో, సమాధానం అక్కడే వుంటుంది. శాస్త్రవాక్యము, గురుదేవుల బోధ, మన స్వానుభవము ఏకమగుటే సమాధానము. అంటే మనము శాస్త్రములలో విన్న విషయము, మన గురుదేవుల ముఖస్తుగా వచ్చిన బోధ మనం ఆచరించినపుడు, మనకి కలిగిన అనుభవము తద్భిన్నంగా వుండదు. మనం విన్నది, ఆచరించినది, అనుభవము ఒకటవడమే సమాధానము.

సాధన చతుష్టయ సంపదలో నాల్గవది ముముక్షుత్వం. అంటే మోక్షమునందు ఆపేక్ష కలిగి వుండటం. పై చెప్పినవన్నీ దారితీసేది మోక్షానికే కదా! మనం బ్రతికి వుండగానే నిజమైన తృప్తి కలిగి వుండడం. అదే ఆత్మానుభూతి. దానిని మనం ఒంటిమీద జ్వరం అనుభవించినట్టుగా అనుభవించగలగాలి. అంతేగానీ, చచ్చిన తర్వాత మోక్షం రాదు. చచ్చాక వచ్చేది బూడిదే.

ఇటువంటి సాధన సంపదని సంపాదించుకుని గురుదేవుల నాశ్రయించాలి. అప్పుడు గురుదేవులు మనకి మంత్రోపదేశం చేస్తారు. "ఓం నమశ్శివాయ", "ఓం నమో నారాయణాయ", "ఓం శ్రీం రాం" – ఇవన్నీ తారక మంత్రరాజములే. ఇవి దాచుకునేవి కావు. సభాముఖంగా చెప్పినంత మాత్రాన అవి మంత్రాలు కాకుండా పోతాయా? కానీ, మంత్రోపదేశం పొందాక కొంచెం బోధ, అనుస్థానం ఎలా చేయడం అనే విషయాలను శ్రవణం చేయాలి. కొన్నాళ్లు దీక్షగా ఆ మంత్రాన్ని అనుష్ఠానం చేయాలి. ముందు ప్రాక్టీసు కోసం, ఉదయం ఒకగంట, సాయంత్రం ఒక గంటా చేసుకోండి అని చెప్పినా, ఆ మంత్రాన్ని అహర్నిశలూ అనుకోవచ్చు. ఆడవారికి ఇబ్బంది రోజులు వస్తే మంత్రం అనుకోవచ్చా అని అడుగుతూ వుంటారు. ఆ రోజుల్లో భోజనం మానటం లేదుకదా? మరి మంత్రం జపించుకోడానికి, ప్రార్ధన చేసుకోడానికి అడ్డేమిటి? పూజాది క్రియాకలాపాలు చేయకూడదు కానీ, మనసారా మంత్రాన్ని ఎందుకు జపించకూడదు? 'క్షరం' అంటే నాశనం క్షరం కానిది 'అక్షరం' - అంటే నాశనం లేనటువంటిది. అటువంటి అక్షర స్వరూపమైనది మంత్రం. దానిని ఎల్లవేళలా జపించడానికి అడ్డు ఏమిటి?

ఈమధ్య మూడేళ్ల పిల్లలని తీసుకుని వచ్చి అక్షరాభ్యాసం చేయమని వస్తున్నారు. ఆ పిల్లవాడిని బలపం పట్టుకోమంటే "ఆ-అది నాది, పలకనాది" అని లాగేసుకుంటాడు. మన చేతిని కూడా తోసి పారేసి, వాడు ఆ పలక మీద పిచ్చి గీతలు గీయడం మొదలు పెడతాడు. వాడు రాస్తున్నదే చదువు అనుకుంటాడు. మన మాట వినసే వినడు.

అదేవిధంగా, అక్షరస్వరూపుని అనుభవం పొంది వున్న మహాత్ములు మనకి మంత్రమనే అక్షర స్వరూపాన్ని దిద్దమంటే, మనం అది చేయకుండా, ఇందాకటి చిన్నపిల్లవాడి లాగానే, విషయాదులని దిద్దుతున్నాం. "అది అజ్ఞానంరా నాయనా! వాటిని తుడిపేసి, నాశరహితమైన అక్షరాన్ని దిద్దరా" అని మహాత్ములు మన చెవిలో ఇల్లు కట్టుకుని బోధిస్తున్నారు. పెద్దలు చెప్పినట్లు దిద్దగా దిద్దగా పిల్లవాడికి అక్షరాలు వచ్చినట్టు, గురువులు చెప్పిన విధంగా అక్షర స్వరూపుడైన భగవంతుడి దివ్యనామాన్ని అనగా అనగా, ఆ అక్షరస్వరూపం మనమే అయిపోతున్నాం. ఇది పొందడానికి ముందు చెప్పిన సాధన చతుష్టయ సంపద కలిగివుండాలి. గురుదేవులు ప్రసాదించిన మంత్రాన్ని దాచవలసింది మన హృదయంలో గానీ, ఇనపెట్టెలోనో, బీరువాలలోనో కాదు. అక్షరస్వరూపుని తత్వాన్ని తెలిపే బీజాక్షర సమన్వయ మంత్రాన్ని ఎంత చేస్తే అంత ఫలితాన్నిస్తుంది. దానికే ఖర్చూ లేదు. ఏ దొంగా దానిని మననుంచి దొంగిలించలేడు. భగవన్నామం అన్నకొలదీ మన శక్తి, పుణ్యం పెరుగుతాయి. భగవన్నామాన్ని రహస్యంగా వుంచాలని కొందరంటారు. భగవంతుడు ప్రతి ఒక్కరికీ సొంత ప్రాపర్టీ (ఆస్తి). కనుక ఆయన దివ్యనామం మన అందరి స్వంతం.

గురుబోధ వింటూ సాధన చేసుకోవాలి. లేకపోతే అది గాలిలోని దీపంలా రెపరెపలాడుతుంది. అందుకనే సాధన చతుష్టయ సంపదని సంపాదించుకోవాలన్నారు. సద్గురుమూర్తి నెమ్మది నెమ్మదిగా మనని ఆధ్యాత్మికతలోకి దింపి, విశ్వాసం పెంపొందిచుకునేటట్టు, సాధన చతుష్టయ సంపద పెంపొందించుకునేటట్టు చేస్తున్నారు. గురువంటే మనకంటే భిన్నంగా (వేరుగా) లేరు. మనలోనే వుండి మనలని నడిపిస్తున్నారు. కానీ గురుదేవుడిని సామాన్య నరుడని ఎంచితే మాత్రం శతకోటి కల్పాంతరాలకైనా గురుతత్వం అర్థంకాదు.

-సశేషం



క్షమామండలే భూప భూపాల బృందైః
సదాసేవితం యస్య పాదారవిందమ్
గురోరంఘ్రి పద్మే మనశ్చేన్నలగ్నం
తతఃకిమ్ తతఃకిమ్ తతఃకిమ్ తతఃకిమ్ ॥

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

25.6.85

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "భగవచ్చింతన చేయటానికి సంసారం అడ్డువస్తుందా? సంసారాన్ని నువ్వుపట్టుకున్నావా? లేక సంసారం నిన్ను పట్టుకుందా? సంసారాన్ని నేను వదలలేక పోతున్నాను కాబట్టి భగవచ్చింతన చేయలేకపోతున్నాను అంటాడు మానవుడు.



బోయవాడు కోతిని పట్టుకోడానికి భూమిలో గొయ్యి తవ్వి ఆగోతిలో ఒక సన్న మూతిగల కుండను పెట్టి దాని నిండా వేరుశెనగ పప్పుతో నింపి ఉంచుతాడు. దానికి కొంతదూరంలో ఒక చెట్టుచాటున పొంచి ఉండి ఆదారి పొడవునా వేరు శనగప్పులు వేసి కోతిని పట్టుకోవటానికి వలపన్ని ఉంటాడు. కోతి వేరుశెనగ పప్పులకు ఆకర్షింపబడి దారిపొడవునా ఉన్న పప్పులను తిని సంతుష్టి చెందక కుండ దగ్గరకి చేరుతుంది. కోతి కుండలో ఉన్న పప్పులను చూసి ఆశపడి తన చేయి సన్నని మూతిగల కుండలోనికి పోనిచ్చి చేతినిండా వేరుశెనగపప్పు పట్టుకుని చేయి బయటికి తీసుకోవటానికి ప్రయత్నిస్తుంది.

ఎంత లాగితే మాత్రం అది బయటకు వస్తుందా? గుప్పెట్లో ఉన్న పప్పుని ఆశచేత వదలలేక వివేకం కోల్పోయి ఎవరో తన చేయి పట్టుకున్నారనే భ్రమలో పడిపోయి బోయవాడు పన్నిన వలలో చిక్కుకుంటుంది. కోతిని ఎవరైనా పట్టుకున్నారా? ఇప్పుడు కోతి బోయవాడికి చిక్కుకోటానికి కారణం? అలాగే మానవుడు సంసారసాగరమనే బంధనలో తాను చిక్కుకుని సంసారమే తనకి బంధనగా ఉంది అనటం సమంజసమేనా? పక్వస్థితికి చేరిన ఫలం ఆచెట్టుని పట్టుకొని ఉంటుందా? పరమాత్ముడు సాకార బ్రహ్మంగా మానవాకారంలో ఉన్నా, ఆయన శక్తిని ఎవరైనా అంచనా వేయగలరా?

మానవుడు వివిధ రంగాల్లో సాధించే ప్రగతి ఎలా సాధ్యపడుతున్నది? దాని ప్రజ్ఞ ఎవరిది? ఒక light ఇచ్చే కాంతిగాని loud speaker దార్వా వచ్చే శబ్దముగాని ఒక fan దార్వా వచ్చే గాలిగాని రావటానికి తోడ్పడే ఒక శక్తి ఉంది. అలాగే మానవ దేహమనే యంత్రం పనిచేయటానికి శక్తి కావాలి. మానవుని మనస్సు సంకల్పించి, చిత్తము ఆలోచనచేసి, బుద్ధి నిర్ణయించి అహంకారము క్రియారూపం దాల్చింది. ఈ

అంతరింద్రియాలన్నీ పనిచేయటానికి శక్తి ఎక్కడిది? అదే ప్రజ్ఞానం బ్రహ్మ లేక చైతన్యము.

ఒక గృహములో మానవుడు ఉన్నంత కాలము అది ఎంతో కళకళ లాడుతూ ఉంటుంది. కాని అతడు అక్కడ నించి తప్పుకుంటే ఏమౌతుంది? దాంట్లో దుమ్ము, ధూళి చేరి తేళ్ళు, జెర్రులకు నివాసమౌతుంది. అటువంటి గృహంలో పడుకోవటానికి ఆ గృహ యజమానే భయపడుతాడు. ఎంతమందినో ఆకర్షించిన ఆ ఇల్లు ఇపుడు ఇలా నివాసానికి యోగ్యత కోల్పోవటానికి కారణం? ఆ ఇంటియజమాని ఆగృహంలో ఉండి దాన్ని జాగ్రత్తగా maintain చేయక పోవటం వలననే కదా!

అలాగే నీలోని చైతన్యం తప్పుకుంటే నీ దేహం ఒక ప్రేతే కదా! ఇంతకాలంగా ప్రేమించిన ఆప్రేతని ఇప్పుడు ప్రేమించగలుగుతారా? ఒక గృహంలో శాంతి ఆనందము ఉండాలంటే ఆగృహంలో దైవచింతన లేక ఆధ్యాత్మిక దృష్టి అవసరం. తండ్రి సుగుణ సంపన్నుడైతే తన పుత్రుడు కూడ మంచి ప్రవర్తన కలిగి ఉంటాడు. తండ్రి సిగరెట్టు కాలుస్తూ కొడుకుని సిగరెట్టు కాల్చవద్దు అంటే ఎలా ఉంటుంది? 'నాన్నగారూ, మీరు ఖరీదైన సిగరెట్టు కాలుస్తున్నారు. నేను ఇంకా తక్కువ ఖరీదువే కాలుస్తున్నాను' అని అంటాడు. వీటన్నిటిని అధిగమించి సుఖశాంతులు పొందాలంటే సద్గురుమూర్తిని వెతుక్కోవాలి.

శాస్త్రానుభవం, సాహిత్య ప్రతిభ ఉన్న వ్యక్తి ఆత్మ వస్తువును దర్శించనట్లయితే ఏం ప్రయోజనం? శాస్త్రం శ్రవణానందంగా ఉండవచ్చు. కాని మోక్షాన్ని ప్రసాదించలేదు కదా! అందువలన సద్గురు మూర్తి అంటే map లో America చూసిన వ్యక్తి వంటివాడు కాదు. తాను America ను దర్శించినటువంటివాడు. America ను దర్శించినవాడే ఎలా America ను దర్శింప చేయకలుగుతాడో అలా సద్గురుదేవులే ఆత్మాసాక్షారానుభూతిని కలిగించగలడు" అన్నారు.



# శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు

*మార్చి 2013*

6 బుధ శ్రీగురుదశమి సత్సంగ సమావేశము, శ్రీసద్గురుపాదపూజ

9 శని శని త్రయోదశి

10 ఆది మహా శివరాత్రి. తె.ఝా 3 గం. లకు బృందావనంలో శ్రీ సద్గురు దేవులకు రుద్ర, నమక, చమక సహితంగా మహాభిషేకం, 5.30 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, 7.30 గం.లకు శ్రీ రామలింగేశ్వరస్వామికి సామూహిక రుద్రాభిషేకములు, 11 గం.లకు శ్రీ రామలింగేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకము. లక్ష బిల్వార్చన, భక్త సమారాధన. సాయంత్రం 6.30.లకు శ్రీ మహాకాళికా పరమేశ్వరీ శ్రీ రామలింగేశ్వరుల లీలా కళ్యాణము. అనంతరము శ్రీ మహాకాళికా పరమేశ్వరీ సహిత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి నగరోత్సవము,

14 గురు శ్రీలలితానందసరస్వతీస్వామిని ఆరాధన, శ్రీసద్గురుపాదపూజ

27 బుధ పూర్ణిమ హెూలీ. శ్రీసద్గురుపాదపూజ

**ఏప్రిల్ 2013**

05 శుక్ర గురుశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

08 సోమ మాస శివ రాత్రి.

11 గురు శ్రీ విజయ నామ సంవత్సర ఉగాది 11 గం.లకు పంచాంగ శ్రవణం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

12 శుక్రవారం నుంచి 18 గురువారం వరకు మౌన ధ్యాన సప్తాహ శిబిరం.

19 శుక్ర శ్రీ రామనవమి, ఉదయం గం.5.30లకు శ్రీ సద్గురు పాదపూజ, 11 గం.లకు సామూహిక శ్రీ సీతారామ కళ్యాణములు, భక్త సమారాధన.

25 గురువారం పూర్ణిమ - శ్రీ సద్గురు పాద పూజ.

హంస పిల్ల తల్లి హంసని చేరాలని తపన పడుతుంది. తెగ ఆరాట పడుతూ ఉంటుంది. అలాంటి పిల్లని పంజరంలో బంధించి మనం ఆనందపడుతూ ఉంటాము. ఈ పంజరాన్ని పటాపంచలు చేయటం మన చేతిలో ఉన్న పని. అలా చేస్తే ఎలా ఉంటుంది? హంసపిల్ల పరుగుపరుగున తన తల్లి హంస దగ్గరకి వెళ్ళి, ఆ తల్లి రెక్కలలో ఒదిగిపోతుంది. ఇక ఈ ప్రపంచంతో నాకు ఎలాంటి సంబంధం లేదు అన్నట్లు ఆనందంలో మునిగి ఉంటుంది.

మనమందరమూ అలాంటి పంజరాలలో బంధించబడ్డ పిల్లలమే. దాని నుండి బయటపడే ప్రయత్నం చేయాలి. అలాగని ఒక స్టీలుపంజరం నుండి ఇంకో బంగారు పంజరంలోకి మారనూకూడదు. ప్రయత్నమూ చేయకూడదు. జాగ్రత్త పడాలి. శ్రీబాబూజీ మహరాజ్, శ్రీమాతాజీవారు ఆశ్రమంలో ఉంటూ అలాంటి జాగ్రత్తని పొందమని హెచ్చరిస్తున్నారు. ఇక ప్రయత్నం మన వంతు.

– కొండ వెంకట్రాజు

# యోగవాశిష్ఠము

-సుషుమ్న ప్రసాద

(గత సంచిక తరువాయి)

అహంకారం - అహంకారమొక శాపం లాంటిది. దాని వలన కర్మ, బాధ, కోరికలు ఉత్పన్నమవుతాయి. దుష్టత్వానికి దారి తీస్తుంది. మాయా జనితమైన అహంకారం మనల్ని మోసగిస్తుంది. దీనికి సహజంగా ఉనికి లేకపోయినా, ప్రాపంచిక మానవుడు అహంకారానికి బానిస. అజ్ఞానజనితమైన యీ అహంకారం మమకారానికి పుట్టినిల్లు. అవిద్య పొగరుబోతుతనాన్ని పెంచుతుంది. దర్పమనేది మానవునికి ప్రబలశత్రువు. అహంకార రహితమైతేకాని ఆనందం లభించదు. మానవుడు త్యజించాల్సినది దారాపుత్రాదులను కాదు, అహంకారమును.



ఆ అహంకారము మనసులో తిష్ఠ వేసుకుని ఉంటుంది. దాని ప్రభావం చేతనే మానవుడు తప్పులు చేస్తున్నాడు. అహంకారం మనిషిలో వేళ్ళతో పాతుకుపోయి ఎన్నో కలతలకు, కష్టాలకు కారణమవుతోంది. ఇది మనలోని సద్గుణాలన్నిటినీ నశింప జేసి, అశాంతిని కలుగజేస్తోంది. ఈ అహంకారం ఒక భయానకమైన వ్యాధిలాంటిది. కలతలు, కష్టాలు అహంకార జనితమే. గర్వము, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలన్నీ అహంకారానికి సేవకులే. ప్రేమ అనే ఎరవేసి అది మనల్ని లోబరుస్తుంది. అహంకారం వలనే కోరికలు పుట్టలు పుట్టలుగా పెరుగుతాయి. భార్య, సంతానము, స్నేహితులు అనే వలవేసి, అందులో మానవుణ్ణి బంధిస్తుంది. ఇది మానవునికి ప్రబల శత్రువు. శాపం లాంటి అహంకారం నుండి విముక్తిని పొందే మార్గం చెప్పమని రామచంద్రుడు విశ్వామిత్రుని కోరాడు.

కామము, కోరికలు, శాంతికి శత్రువులు. అవి గుడ్లగూబలాగ మానసిక వలయం చుట్టూ పరిభ్రమిస్తాయి. మనలోని మంచి లక్షణాలన్నీ పారద్రోలుతుంది. పంజరంలోని పక్షిలాగ మనం కోరికలనే పంజరంలో బంధింప బడ్డాము. కోరికలనే అగ్ని మనల్ని కాల్చివేస్తుంది. ఈ కోరికలే మనకు పునర్జన్మకు, బంధానికి, దుఃఖానికి మూలహేతువులు. కోరికలు పదునైన కత్తిలాంటివి. అవి మానవుడి హృదయాలలో చేరి నిష్కారణంగా బాధపెడతాయి.

దేహం - ఈ శరీరం రక్తమాంసాదులతో, నరములు, ఎముకలు, చీముతో నిండి ఉండి, పైన చర్మంతో కప్పబడిఉంది. ఈ దేహం రోగాలకు నిలయం. అది నశించిపోయే స్వభావం కలది. ఈ శరీరం ఒక బుడగలాంటిది. అది ఎప్పుడైనా పగిలిపోవచ్చు. ఈ

రోజు మెరుస్తూ మురిపించే ఈ శరీరం, రేపు ముడతలుపడి, వికారంగా తయారవుతుంది. ఈ శరీరాన్ని నిత్యమైన, సత్యమైన ఆత్మగా భావించటం సిగ్గుచేటు. ఎవరికైతే మెరుపులో స్థిరత్వం, మేఘంలో వర్షం పైన నమ్మకం ఉంటుందో వారు ఈ దేహాన్ని సత్యమని వ్రేలాడతారు.

శైశవము – పసిపిల్లవాడు నిస్సహాయ స్థితిలో ఉంటాడు. ఏమీ తెలియని అమాయకుడు. నిష్కారణంగా ఏడుస్తాడు. మన్ను తింటాడు. నిప్పు ప్రమాదమని తెలియదు. పూర్తిగా యితరులపై ఆధారపడిన దశ యిది. ఇది ఆనందకరమైన దశ అని ఎలా అనగలం?

యౌవనదశ – ఈ దశలో మానవుడు కామానికి బానిస. మంచి గుణాలకు తిలోదకాలు యిచ్చి, వ్యసనాలకు లోనవుతాడు. యుక్తాయుక్త విచక్షణ లేకుండా, కామానికి బానిసయై, క్షణికమైన యుక్తవయస్సులో ఒక పశువులా ప్రవర్తిస్తాడు. నిజమైన జ్ఞాని యుక్తవయస్సులో ప్రతిబంధాలను ఎదుర్కొని ఆత్మజ్ఞానాన్ని పొందుతాడు.

వృద్ధాప్యము – వృద్ధాప్యం ఈ శరీరాన్ని వడలింపజేసి, సౌందర్యాన్ని హరిస్తుంది. కుటుంబ సభ్యులు వృద్ధులను చులకన దృష్టితో చూస్తారు. మానవుడు పసితనంలో, వృద్ధాప్యంలో కూడా నిస్సహాయ స్థితిలో ఉంటాడు. జ్ఞానేంద్రియాలు తమ శక్తిని కోల్పోతాయి. తన కోరికలను తీర్చుకోలేడు. జ్ఞాపకశక్తి క్షీణిస్తుంది. ఎన్నో రకాల వ్యాధులకు లోనవుతాడు. సుఖాలను అనుభవించాలని అంతులేని ఆరాటంతో ఉంటాడు కాని సమర్థత ఉండదు. కోరికలు లోపల దహించివేస్తూ ఉంటాయి, కాని దాన్ని తీర్చుకునే శక్తి మాత్రం పూర్తిగా లోపిస్తుంది.

– సశేషం



# గురు కృపా హి కేవలమ్

– రమణ ప్రసాద్

శ్రీబాబు బస చేసిన యింటి అరుగు మీద చిక్కి శల్యంగా ఉన్న ఒక వ్యక్తి అస్వస్థతతో పడుకుని ఉన్నాడు. అతడు ఆరోగ్యంగా ఉన్నప్పుడు బియ్యపు బస్తా అవలీలగా మోసేబలాఢ్యుడు. ఆయన శ్రీబాబుని చూసి నమస్కరించాడు. "ఏమీ ఫరవాలేదు. ఆశ్రమానికి వెళ్ళి రోజూ తీర్థం తీసుకో. నామస్మరణ చేసుకో. నీ రోగం నయమవుతుంది" అన్నారు శ్రీబాబు.

ఆయన క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్నాడు. మద్రాస్, రాయవేలురులలో వైద్యం చేయించుకున్నాడు. వారు లాభం లేదు అన్నారు. మహా ఉంటే 'పదిరోజులు కన్న ఎక్కువ బతకవు' అని డాక్టర్లు చెప్పారు. బాబు చెప్పిన ప్రకారం నడచుకుని ఆశ్రమానికి వచ్చి రోజూ తీర్థం తీసుకుని త్వరలో కోలుకున్నాడు. ఆ తరువాత వచ్చిన నవరాత్రి మహోత్సవాలలో సభలో ఉన్న ఆయనను చూసి శ్రీబాబు "ఎలా ఉన్నావు?" అని పలకరించారు. 'మీరు చెప్పినట్లు అమ్మతీర్థం తీసుకుంటున్నాను. నామం చేసుకుంటున్నాను. రోగం దానంతట అదే తగ్గిపోయింది. ఇప్పుడు నాకు క్యాన్సర్ లేదు ఏమీ లేదు. ఇదంతా తమ దయ!' అన్నాడు.

"నేను చేసింది ఏమీ లేదు. అసలు చేయటానికి నేను ఎవరిని? అంతా అమ్మే నా ద్వారా చేయిస్తోంది. నేను కేవలం అమ్మ చేతిలో పరికరాన్ని మాత్రమే" అన్నారు శ్రీబాబు. ఆయన పేరు కృష్ణమూర్తినాయుడు. అందరూ భీమవరం నాయుడని పిలుస్తారు.వారి కుమారులు మనుమలు కూడా అదే బాటలో నడచి, శ్రీమాతాజీవారు ఆదేశించినట్లు భక్తి ప్రపత్తులతో మెలగుతున్నారు. వారికి ఐహికంగా ఏలోటూ రాలేదు. అది గురుకృప!

శ్రీబాబు సర్వవ్యాపకత్వం గురించి అనేక ఉదంతాలు ఉన్నాయి. 'ఒకే సమయాన పెక్కుతావుల గోచరించ అద్భుత రసంబు' అని కవిగారి వాక్కు. (శ్రీ పరిమి సుబ్రహ్మణ్యంగారు).

శ్రీ లంక శేషగిరిరావుగారు శ్రీబాబు ముఖ్యశిష్యులలో ఒకరు. ఆయన మిత్రులు ఒకరోజు వచ్చి సినిమాకు వెళ్దాం రమ్మనమన్నారు. శేషగిరిరావుగారు ఆయనతో, ' ఏవేళైనా రాగల మహానుభావుడురా బాబు. తీరా నేను ఆయన వచ్చే వేళకి యింట్లో లేకపోతే ఎలాగ?" అన్నారు. కానీ మిత్రుడి బలవంతం మీద సినిమాకి వెళ్ళారు. ఆ రాత్రి ఎక్కడి నుంచి వచ్చారో! ....బాబు వచ్చారనే వార్త సినిమాహాలులో ఉన్న శేషగిరిరావుగారి చెవులో పడింది. ఆయన రొప్పుకుంటూ పరుగుపరుగున

వచ్చారు. శ్రీబాబు నవ్వుతూ “ఏం సినిమా? మాయాబజారేనా? అంతా మాయ కదూ!” అన్నారు. తరువాత కొంతసేపు ఉండి శ్రీబాబు వెళ్ళిపోయారు.

నాలుగురోజుల తరువాత సీతయ్యగారు, శేషగిరిరావుగారికి కనబడి సరిగ్గా అదేసమయంలో రాజమండ్రిలో (గుండుగొలనులో ఉన్న శేషగిరిరావుగారి దగ్గరకు శ్రీబాబు వచ్చినప్పుడే) శ్రీబాబు తన దగ్గర ఉన్న మందులను సరిచూస్తున్నారు అని చెప్పారు. మరి చంపక కూడా (భీమవరం తాతయ్యగారి కోడలు) ఆసమయంలో భీమవరంలోనే మా దగ్గరే ఉన్నారు అని నొక్కి చెప్పింది.

ఇదంతా బాబులీల! ఆయన సర్వవ్యాపకత్వానికి తార్కాణము. మన బాబు సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపులే! శ్రీబాబు, అమ్మల సర్వవ్యాపకత్వాన్ని గురించిన విశేషాలు మరోసారి....

*

శుక నాళికా న్యాయం

చిలకలను పట్టుకునే వేటగాడు ఒక గిలకను తయారుచేస్తాడు. దాన్ని ఒక చెట్టు మీద ఉంచుతాడు. దానితోబాటు కొంత తినుబండారాన్ని కూడా ఉంచుతాడు. ఒక చిలక వచ్చి ఆ గిలక మీద కూర్చుంటుంది. దాని బరువుకు ఆ గిలక గిఱ్ఱున తిరగటం మొదలవుతుంది. ఆ వేగానికి భయపడ్డ చిలక ఎక్కడ పడిపోతానోనని ఆ గిలకనే అంటగరచుకుని ఉంటుంది. వేటగాడు వచ్చి చిలకను పట్టుకుంటాడు.

అసలు గిలక తిరగటం చిలుక శక్తితోనే. చిలుకకు ఎగిరిపోవటానికి రెక్కలు ఉన్నాయి. గిలక జడం. చిలుక చైతన్యం. అయినా అజ్ఞానంతో బంధంలో పడిపోయింది. స్వయంకృతాపరాధం కాక మరేమిటి?

– వెంకట రమణ ప్రసాద్

# శ్రీమాతాజీతో యూరప్ యాత్ర

– డాక్టర్ సుధారాణి

(రచయిత్రి అందజేసిన వ్యాసము సందర్భాన్ని బట్టి స్వల్పమైన మార్పులతో అందించ బడుతోంది .............. ఎడిటర్ )

సామాన్య వ్యక్తి, సద్గురుమూర్తి అందజేసిన ప్రసాదాన్ని రూప నామ గుణాలను ఆపాదించి స్వీకరించటం సహజం. కాని భక్తుడు ఆ ప్రసాదాన్ని రూపనామగుణాలను మరచి భక్తితో స్వీకరిస్తాడు. అలాగే సద్గురుమూర్తితో యూరప్ సందర్శించే భాగ్యం లభించినందుకు ఎంతో ఆనందిస్తూ నా అనుభూతులను అందజేస్తున్నాను.

ప్రథమంగా హైద్రాబాద్ నుండి 33మంది భక్తులు దుబాయ్ మీదుగా ఇంగ్లాండు చేరుకున్నారు. భక్తులు రామకృష్ణగారింట్లో మూడురోజులు సత్సంగం అనంతరం హిందూ దేవాలయంలో సత్యనారాయణ వ్రత పూజ, భజన, సత్సంగంతో కార్యక్రమాలు ముగిశాయి. లండన్ నగరంలో అనేక విశేషాలు దర్శించాము.

'లండన్ ఐ' అనే పెద్ద వీల్‌లో నెమ్మదిగా లండన్ నగరాన్ని దర్శిస్తున్న సమయంలో అమ్మ బోధ చేస్తూ "మనమంతా ఆ పరమాత్ముడి కన్నులలో ఉన్నాము. అలా ఉండి విశ్వాన్నంతా దర్శిస్తున్నాము" అన్నారు.

ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం కూడా ప్రార్థన, సంకీర్తన తప్పక ఉండేవి. జూన్ 7వ తేదీ లండన్ నగరం నుండి యూరో టనేల్ ద్వారా మేము ఎక్కిన బస్సుతో ఒక ట్రైన్ ద్వారా పారిస్ చేరుకున్నాము. యూరోటనెల్స్ సముద్రపు అడుగు భాగాన గల టనెల్. పారిస్ విశేషాలు దర్శించి రైన్ నది మీదుగా నెదర్‌లాండ్స్ చేరుకున్నాము.



రైన్ నదిలో నావలో ప్రయాణి స్తున్నప్పుడు మాతాజీ నావలో ముందు కూర్చున్నారు. మన జీవిత నౌకకు నావికుడు గురుదేవుడు. ఆయున మనల్ని ఎంతో జాగరూకతతో ప్రయాణం చేయించి మన గమ్యస్థానాన్ని చేర్చినట్లుగా ఉంది ఆ ప్రయాణం.

ఆ రోజు సాయంత్రం మమ్మల్ని అందరినీ షాపింగ్‌కు పంపి ఆవిడ బయట కూర్చున్నారు. చూడండి! తలి పిల్లలంతా ఆడుకుంటుంటే చూస్తూ ఆనందిస్తుంది. ఆ పిల్లలు

అడుకున్నంతసేపూ ఆడుకుని, చివరకు అమ్మ గుర్తురాగానే ఇళ్ళకి చేరతారు. అలాగే షాపింగ్ పూర్తిచేసుకుని మేమంతా అమ్మ దగ్గరకి చేరాము.

జూన్ 11న జర్మనీ ప్రయాణ సన్నాహాలలో ఉన్నాము. అమ్మ తమ బ్యాగ్ తామే లాక్కుంటూ వస్తున్నారు. ఎవరు ఎంత చెప్పినా ఆవిడ ఆ బ్యాగ్ ఇవ్వలేదు. ఆవిడ మాట్లాడుతూ "మిమ్మల్నందరినీ ఇలాగే లాక్కుంటూ వస్తున్నాను, నాకు ఇదేమీ భారము కాదు ఫరవాలేదులే" అన్నారు.

జర్మనీలో కోలాన్ అనే నగరంలో ఒక చర్చి చూశాము. ఆ చర్చిలో ఒక సాధువు పవళించి ఉన్న మూర్తిని చూశాము. ఆయన పాదాల దగ్గర ఒక కుక్క, ఒక సింహము శిల రూపంలో ఉన్నాయి. శ్రీమాతాజీ వాటిని చూపించి బోధ చేస్తూ " చూశారా! కుక్క విశ్వాసానికి, సింహం సాహసానికి ప్రతీకలు. ఆ గుణాలను అలవరచుకుంటే అంతా సద్గురుదేవుల పాదముల చెంత చేరటానికి అర్హతని పొందవచ్చు" అన్నారు.

మాతో యాత్రలో కొంతమంది ఉత్తరదేశానికి చెందిన మిత్రులు ఉండటం విశేషం. వారంతా శ్రీమాతాజీ భజనలలో, సత్సంగాలలో ఉత్సాహంగా పాల్గొనేవారు. వారిలో ఒక ప్రశ్న ఉదయించింది. 'స్థిరత్వం లేని మనస్సుతో ధ్యానం చేయటం ఎలా?' అని.

దానికి సమాధానంగా శ్రీమాతాజీ వారికి బోధ చేస్తూ "జన్మజన్మాంతర వాసనలతో కూడిన చిత్తమును వాసనా రహితం చేయాలంటే, మనస్సుని సత్సంగంలో ఊరవేయాలి. ఎలాగంటే శనగగింజని పంచదార పానకంలో, ఆవకాయలో, వేపరసంలో (విడివిడిగా) ఊరవేస్తే, చూడండి! ఆ గింజ దేనిలో వేస్తే ఆ లక్షణాలనే పొందుతుంది. మనస్సు కూడా అంతే. ప్రకృతిలో సౌందర్యాన్ని సందర్శిస్తున్నాము. ఈ సౌందర్యానికి ఆధారం ఏమిటి?" అని విచారణ చేయాలి."

-సశేషం



కుంకుమ చందన శోభిత లింగం
పంకజహార సుశోభిత లింగం
సంచిత పాప వినాశక లింగం
తత్ప్రణమామి సదాశివలింగం

# సమర్థ సద్గురు

## (యాజమాన్యం తదితర వివరాలు)

FORM - 4 (8వ నిబంధన ప్రకారము)

| | |
|---|---|
| ప్రచురణ స్థలం | - శ్రీ కాశీ గార్డెన్స్, నంబూరు R.S |
| ఎంత కాలానికి ఒకసారి | - మాస పత్రిక |
| ముద్రాపకుని పేరు | - సి.వి. రమణబాబు |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S<br>గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| సంపాదకుని పేరు | - డి.జె.బి.కె. లాల్. |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S<br>గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| పత్రిక యజమానులు | - యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ<br>ఛారిటబుల్ ట్రస్ట్<br>D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S<br>గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |

పై విషయములు నాకు తెలిసినంత వరకు వాస్తవములని తెలియచేస్తున్నాము.

శ్రీ కాళీ గార్డెన్స్ ( సం) సి.వి. రమణబాబు

ది. 1-3-2013 పబ్లిషర్

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

26. శ్లో॥ కదా వా కాళిన్దీ కువలయ దళ శ్యామల తరాః
కటాక్షా లక్ష్యాన్తే కిమపి కరుణా వీచి నిచితా ః
కదా వా కన్దర్ప ప్రతి భట జటా చన్ద్ర శిశిరాః
కిమప్యన్త స్తోషం దదతి మురలీ కేళీ నినాదాః



తాత్పర్యము -

యమున యందలి కలువరేకుల వలె మిగుల నల్లనైన దయాతరంగాలచే ముంచబడిన శ్రీకృష్ణుని కడగంటి చూపులు ఎప్పుడు కనబడ గలవు? శివుని జడల యందలి చంద్రునివలె, చల్లనైన పిల్లనగ్రోవి మధుర రవాలు ఎప్పుడు నా మనస్సుకి ఆనందం కలిగించునో!

శ్యామసుందరుని రాకకోసం ఎదురు చూస్తూ యమునా తీరాన చేరి ఉండే గోపికలందరం క్షణాలు యుగాలుగా సాగే నిరీక్షణ కాలమంతా కన్నయ్య లీలల్ని వర్ణించుకుని చెప్పుకుంటూ అవలీలగా గడిపేస్తూ ఉంటాం. వీటిలో విన్నవి, కన్నవి, అనుభవించినవీ అన్నీ ఉంటాయి. వీనుల విందైన వాటిని వినాలంటే మళ్ళీ మళ్ళీ చెప్పుకుంటాం. అలాంటిదే ఇవాళ్టి నా యీ బ్రహ్మానందాన్ని తోటివారితో చెప్పాలనే తొందరలో అందరికంటే ముందే వచ్చాను. తీరా చూస్తే ఇంకా ఎవరూ రాలేదు. చల్లని ఇసుకలో చతికిల పడి ఎదురుగా ఉన్న యమునా నదిని చూస్తూ కూర్చున్నాను.

నదిలో కలువలు విచ్చి ఉన్నాయి. తరంగాల తాకిడికి అవి నీళ్ళలో మునుగుతూ తేలుతూ ఊయలలు ఊగుతూ ఉన్నాయి. అవి చూస్తే కన్నయ్య నల్లని కళ్ళు గుర్తు వస్తున్నాయి. కలువరేకులాంటి ఆ కళ్ళల్లో కదలాడే దయాతరంగాలలో ముంచబడిన వాని కడగంటి చూపులు ఎప్పుడు నాపై ప్రసరిస్తాయి? అని మనస్సు తహతహ లాడుతోంది. తల ఎత్తితే పైన ఆకాశంలో శివజటాజూటంలో నిలిచిన భాగ్యశాలి చంద్రుడు కనిపించాడు. ఆ చందమామ అందించే చల్లదనం వంటి పిల్లనగ్రోవి పాటలు వినబడి ఎప్పుడు హృదయానందాన్నిస్తాయో అని ఆలోచిస్తున్నా. నా భుజం మీద చెయ్యి పడింది. తలతిప్పి చూస్తే ఒకరొకరే గోపికలంతా కనిపించారు. 'కన్నయ్య ఇంకా రాలేదా?' అంటున్నారు వాళ్ళంతా. నన్ను చుట్టి అంతా ఇసుక తిన్నెలమీదనే కూర్చున్నారు.

సమయం కదలాలికదా! నేను చెప్పాలనుకుంటున్నదానికి ముందుగా గొంతు విప్పాను. "చిత్రకథ మీకందరికి తెలిసిందేకదా!" అన్నాను. 'కృష్ణ లీల తెలిసిందైనా

మరోమారు చెప్పుకుంటే ఆనందమే కదా' అన్నదొకామె.

"మా పొరుగింటనే ఉండే పిల్ల చిత్ర. గౌరమ్మకి లేకలేక కలిగిన సంతానం అది. ఒకతే సంతానం అని గారాబంగా గుండెలమీద నుంచి దించకుండా పెంచింది తల్లి. చిత్ర పెద్దయ్యాక చూస్తే ఇద్దరిదీ ఒకటే మనస్సు అనిపించేది. అయితే కర్మానుభవాలు ఒకేలా కాక తేడాగా ఉంటాయి. చిత్ర పెరిగిన కొలదీ పూర్వజన్మ సుకృతం వలన బుద్ధి పెరిగి జన్మ సార్థకమేదో ఎరిగినందున కలసిన తమ మనసులను రెండు చేసి, తన భాగాన్ని తీసుకెళ్ళి తను నమ్మిన నందగోపాలునికిచ్చేసింది.

పాపం! గౌరమ్మని చూస్తే జాలేస్తుంది. ఎందుకంటే తన వంతు భాగం మనస్సుని యశోదమ్మకొడుకంటే పడని వాళ్ళకమ్మేసింది. వాళ్ళ దుర్బోధలు తలకెక్కినందున కృష్ణయ్య అంటే ఆవిడ దృష్టిలో నాలిముచ్చు, ఆవులను మేపే గొల్లవాడు, చీకటిలాంటి నల్లని ఒంటి రంగుకలవాడుగా మిగిలాడు.

కాని చిత్రకి మాత్రం నల్లనయ్యలో చీకట్లు తొలగించే దివ్యతేజస్సు కనిపించింది. నమ్మినవారి సొమ్ము, సకల జీవకోటిని కాచే సర్వేశ్వరుడుగా అనుభవాన్ని గణించింది చిత్ర. నల్లనయ్య వారివారి భావాలను బట్టి చిత్రకు తరచుగా కనిపిస్తూ ఉంటాడు. గౌరమ్మకు ఎప్పుడో కాని కనిపించడు. అది కూడా ఆవిడ అర్థం చేసుకోలేని లీలలను చూపిస్తూ కనిపిస్తాడు.

వయస్సు వచ్చాక చిత్రకి గౌరమ్మ పెళ్ళి చేసింది. చల్లని నల్లనయ్య ఆశీస్సులు అందుకుని, మనందరి దగ్గర సెలవు తీసుకుని చిత్ర అత్తవారింటికి మధుర వెళ్ళిపోయిందని మీకందరికీ తెలుసుకదా! అది వెళ్ళాక ఒకమారు కన్నయ్యతో అన్నాను నేను ఏమయ్యా! ఇన్నాళ్ళ బట్టీ నీ దగ్గర ఆనందాన్ని అనుభవించిన చిత్ర అత్తవారింట్లో నీ విరహాన్ని ఎలా సహిస్తోంది? అని. వెంటనే కన్నయ్య చిరునవ్వుతో 'సంసారమనే నాటకంలో నేనిచ్చిన పాత్రను అందరూ మెచ్చుకొనేలా అద్భుతంగా పోషిస్తోంది తెలుసా?' అని. వెంటనే నాకు తోచిన మాట అన్నాను "అవును మరి! నీ అనుగ్రహానికి అంతగా పాత్రమైన చిత్ర మనస్సు నందనందనా! నీ సుందరమందిరం కావటమేనా?" అని. మరోసారి మధురంగా నవ్వాడు కన్నయ్య.

– సశేషం



# పరిప్రశ్నేన సేవయా

– పరాశర ప్రసాద్

'ఆత్మ జ్ఞానాన్ని మానవ జీవిత కాలంలో సాధించటం సాధ్యమేనా?' అని ప్రశ్నించిన డాక్టరుగారికి సమాధానంగా సద్గురుదేవులు ప్రబోధిస్తూ...."మన కృష్ణార్జునరావుగారు డెంటిస్ట్ కదా! ఎంతగా కృషిచేస్తే ఆ స్థితికి వచ్చారు? ఏ రకమైన కృషి లేకుండా ఆత్మ జ్ఞానం కావాలంటే ఎలా వస్తుంది? అది ధనం వెచ్చించి బజారులో కొనుక్కునే వస్తువు కాదుకదా! ఎప్పటికైనా ఆత్మజ్ఞానం తెలుసుకోవలసినదే. అంతవరకు జన్మలు తప్పవు. నీవెవరో నీవు తెలుసుకోవటమే ఆత్మజ్ఞానం. 'నేను ఆత్మజ్ఞానాన్ని పొందాను' అన్నా అది పరిపూర్ణ స్థితి కాదు. అక్కడ వెలితి ఉంది. అత్యంత పరిపూర్ణ వస్తువులో ద్రష్ట, దర్శన, దృశ్యాది భావాలు ఉండకూడదు కదా! 'నేను తెలుసుకున్నాను' అంటే రెండవది ఉన్నట్లేకదా!



ఇంద్రియ దృష్టి ఉన్నంత కాలమూ భేద భావము రహితం కాదు. పంచదార గ్లాసూ, నీళ్ళగ్లాసూ రెండూ వేరువేరుగా ఉన్నాయి అనుకుందాం. పంచదార మాధుర్యాన్ని నీరు పొందలేదు కదా! అలాగే 'నేను వేరు భగవంతుడు వేరు' అని ఎంతకాలం భావించినా నువ్వు అలాగే ఉండిపోతావు. పోనీ 'నేనే ఆ అభవగంతుణ్ణి' అనో, 'అహం బ్రహ్మోస్మి' అనో భావన చేసినంత మాత్రాన ఆ అనుభూతిని పొందగలుగుతావా? పంచదార మధురంగా ఉంటుంది అనే భావన ఎంత కాలం చేసినా ఆ మధుర అనుభూతిని పొందగలుగుతావా? పంచదార నీటిలో కలిపితే నీరు మధురంగా ఉంటుంది. అది కూడా పూర్ణత్వం అనిపించుకోదు. ఆ నీటిని అగ్నికి దగ్ధం చేస్తే నీరు హరించుకుపోయి పంచదార మాత్రమే మిగులుతుంది.

అలాగే ధ్యానాగ్నికి నీచగుణాలు దగ్ధం అయినప్పుడు అక్కడ మిగిలేది 'అహం' అనే ఆత్మభావనే. ఆ స్థితిలో సంకల్పాలకు తావులేదు. ఇంక ద్రష్ట, దర్శన, దృశ్యం అనే భేద భావం ఎక్కడిది? మనస్సుకి నీటిలాగ ఎటు అవకాశం దొరికితే అటు పయినించే లక్షణం ఉంటుంది. అంటే చంచల స్వభావం. అది ధ్యానాగ్నితో రహితం అవుతుంది. దాన్ని సాధించటానికి సత్యగురువుని ఆశ్రయించాలి. ఆయన దాన్ని సాధించే మార్గాన్ని తెలియజేస్తారు" అన్నారు శ్రీగురుదేవులు.

'మోక్షం అంటే ఏమిటి బాబూ?' **అన్నారు డాక్టరుగారు. శ్రీబాబు మాట్లాడుతూ "అచంచల భక్తితో మనస్సుని భగవానునిపై లగ్నం చేసి ధ్యానిస్తే, మనస్సు ఆయనలో లయమై ఆయనే నీ భావనలో నిలుస్తాడు. అప్పుడు 'అహం బ్రహ్మోస్మి' అనే భావనలో ఉంటావు. నీలో దర్శించిన పరమాత్మను అంతటా దర్శించగలుగుతావు. 'అయమాత్మ బ్రహ్మ' అనే భావన ఆరూఢమై ఆనంద సాగరంలో ఓలలాడుతావు. అదే మోక్షస్థితి" అన్నారు.**

# ఏది గొప్ప?

– సుశీలా ప్రసాద

సహజ కాంతులతో వెలిగే కైలాస శిఖరమందలి స్ఫటిక శిలాభవనం నేడు ఆది దంపతుల ఉనికితో మరింత శోభాయమానంగా ఉంది. గిరిజా శంకరులిద్దరూ పాచికలాటలో నిమగ్నులై ఉన్నారు. ఆట మంచి రసపట్టులో ఉంది. అమ్మవారు గెలుస్తోంది. అందుకే మధ్యమధ్యలో ముక్కున మెరిసే ముత్యాల ముక్కెర వెనుక నుంచి మందహాసం చేస్తున్నది. అంతలో ఆమె దృష్టి మధ్యలో భవుని మీద నిలిచింది. "అదేమిటి స్వామీ! మీ ఒంటిమీద అంత చెమటలు పట్టాయి? ఆటలో ఓడిపోతున్నానని భయం కొద్దీనా?" పార్వతి పరిహాసంగా పలికింది. శివుడు వెంటనే "విషయం వింటే నువ్వూ జాలిపడతావు" అన్నాడు. "మీరు ఓడిపోతున్నందుకు ఏదో ఒక సాకు చెబుతున్నందుకు నేను జాలి పడనులెండి" అంది తిరిగి గౌరి హేళనగా.

"నేను చెప్పేది వినకుండా ఎందుకు తొందరపడతావు ఉమా? భూలోకంలో నా పరమ భక్తుడు ఒకడున్నాడు. అతడిప్పుడు ఆపదలో ఉన్నాడు. తనంటే గిట్టని ఒక దుష్టుడు అకారణంగా వానితో తలపడ్డాడు. పాపం! ఆ భక్తుడు భయంతో ఒణికిపోతూ 'పరమేశా! పార్వతీ పతీ! పాహి పాహి!' అని మొరపెట్టుకుంటున్నాడు. వానికి పట్టిన చెమటలు, నా యందే ధ్యాస నిలిపినందుకుగాను నాకు సంక్రమించాయి. ఏం చెయ్యమంటావు?" అని చెబుతూనే ఆట వదలి అంతర్హితుడయ్యాడు. "ఓహో! ఆ పరమభక్తుని రక్షణ తక్షణ కర్తవ్యంగా తలచి పరుగెత్తారీ భోలాశంకరులు! ఈ ఆట ఎప్పటికి ముగిసేను?" అనుకుంటూ నిట్టూర్పు విడిచింది జగన్మాత.

కొద్ది క్షణాలు గడిచేసరికి పశుపతి తిరిగి వచ్చేశాడు. నాథుని చూస్తూనే "మీ భక్తుని రక్షించి చాల త్వరగానే వచ్చాశారే! ఏం చేశారు తమరు?" అన్నది అంబ ఆత్రుతతో. "ఏం లేదు. నా సహాయం అర్థిస్తూ నన్ను రమ్మనమని కోరుతూ మొర పెట్టుకుంటున్న ఆ భక్తుడు, మన సంభాషణ జరిగి, నా రాక ఆలస్యమైనందున, నన్ను వదలి, నా నామాన్ని అదే పనిగా తైలధారగా జపిస్తూ శత్రువుమీద తిరగబడ్డాడు. విజయం వానిదే అయింది. ఇంక నా అవసరం లేదని తిరిగి వచ్చేశాను. ఇంతకీ నా కన్నా, నా నామం గొప్పదటంవా పార్వతీ?" అని అడిగాడు పరమేశ్వరుడు సందేహంగా.

"అది అలనాడు త్రేతాయుగంలో మీ అంశ అయిన హనుమంతుడు తనకిష్టదైవమైన శ్రీరామచంద్రునితో పోరాడినప్పుడు తన స్వామి నామమే గొప్పదని ఋజువు చేశాడు కదా. భగవంతుని రాకకైనా జాగుంటుందిగాని, నామ స్మరణ తక్షణ ఫలితాన్నిస్తుందని వేరే చెప్పాలా ప్రభూ!" అన్నది జగదంబ.

*

# స్థిత ప్రజ్ఞుడు

- పరాశర ప్రసాద్

మానవుడి స్వభావము సుఖదుఃఖాలు కలిగినప్పుడు బహిర్గతమవుతుంది. తనకి భిన్నంగా రెండవ వస్తువు ఉన్నదని భావించినప్పుడే భయము, ద్వేషము, రాగము, సందేహము కలుగుతాయి. స్థితప్రజ్ఞుడు ప్రపంచాన్ని కాలిన వస్త్రంలా చూస్తాడు. ఆయన ప్రజ్ఞ స్థిరమైనది. ఆయన చిత్తం అయిదు భూమికలకు ఆవల ఉంటుంది. దేహ భావన కలిగి ఉండటం మూఢం. దానిని అధిగమించాడు. దేహాన్ని గురించి చింతన చేయటం క్షిప్తము. దానిని జయించాడు. ధ్యానంలో మనస్సు పరిపరి విధాల పరుగెత్తడం విక్షిప్తం. మనస్సు స్థిరపడినవాడికి ఆ స్థితి దూరమే కదా!

మనస్సు ఏకాగ్రత స్థితిలో నుండి ఆత్మలో లయించినప్పుడు విరుద్ధమే కదా! అటువంటి గురువుగారి భార్య దేహత్యాగం చేసింది. ఆయన కళ్ళవెంబడి అశ్రుధారలు జాలువారాయి. ఆయన శిష్యులు గురువుగారు దుఃఖిస్తున్నారని గుసగుసలాడుకోవటం చూసి, గురువుగారు శిష్యులనుద్దేశించి మాట్లాడుతూ 'నా గురించి మీరు చెందే వ్యథను చూసి, నాకు దుఃఖం కలిగింది. అంతేకాని దేహత్యాగం చేసిన నా భార్యను గురించి నేనెన్నడూ దుఃఖించను' అన్నారు.

ఇక్కడ మీకొక దృష్టాంతం చెబుతాను. హరిశ్చంద్ర నాటకం చూసిన తరువాత బయటకు వచ్చిన చంద్రమతి పాత్రధారిని ఉద్దేశించి ప్రజలు ' మీరు మీ పాత్రలో జీవించారు. ఎంతో కష్టపడ్డారు. మీరు దుఃఖిస్తుంటే చూసి, మేమంతా చాలా బాధ పడ్డాము' అన్నారు. దానికి సమాధానంగా ఆవిడ 'డబ్బులు ఇచ్చి మీరంతా ఏడ్చారు కాని, నేను నిజంగా దుఃఖపడలేదు' అన్నది.

స్థితప్రజ్ఞుడు తాబేలు లాంటివాడు. తాబేలు ఉభయచరి. నీటిలోనూ, నేలమీద కూడా సంచరించగలదు. అలాగే స్థితప్రజ్ఞుడు ఏకాంతంలోనూ, సంఘంలోనూ కూడా ఉండగలడు. అంతేకాదు తాబేలు అవసరం వచ్చినప్పుడు ఇంద్రియాలను బయటపెట్టి సంచరిస్తుంది, అవసరంలేనప్పుడు ఇంద్రియాలను ముడుచుకుంటుంది. అలాగే స్థితప్రజ్ఞుడు ఏకాగ్ర మనస్సుతో తాను ఆర్జించిన జ్ఞానాన్ని అవసరం వచ్చినప్పుడు ప్రజలలోకి వెళ్ళి ఆ జ్ఞానాన్ని వారికి అందజేస్తాడు.

బలవంతంగా ఇంద్రియాలను నిగ్రహించినవాడికి జన్మాంతర వాసనలకు గురికాక తప్పదు. అయితే ఇంద్రియాల సంయమనం పాటించినవాడికి మాత్రం ఆ వాసన ప్రభావం ఉండదు. ఇంద్రియాలను పరమాత్మ స్వరూపాన్ని గుర్తించటానికి ఉపయోగించాలి. అంతేకాదు వర్తమానంలో జీవించాలిగాని భూతకాలం గురించిగాని, భవిష్యత్తు గురించిగాని ఆలోచించే వ్యక్తి ఎన్నటికీ స్థితప్రజ్ఞుడు కాలేడు.

దుష్టకార్యాలు చేసేవారు చాల మంది పుణ్యకార్యాలు చేయవచ్చు. దానము, ధర్మము, యజ్ఞయాగాదుల వలన పాపం హరిస్తుంది. కాని దానివల్ల ప్రయోజనం శూన్యం. పాప రహితుడు అవటం కన్నా, పాపబుద్ధి పోవాలి. నేలబావిలోపడి కుక్క చచ్చిపోయింది. ఆ విషయం ఎవరికీ తెలియదు. బావిలో నీరు దుర్వాసనగా ఉంది. బావిలో నీరంతా తోడేశారు. అయినా దుర్వాసన పోలేదు. బావిలో చచ్చిపడి ఉన్న కుక్కను తీయకపోతే దుర్వాసన పోదుకదా!

గురుమూర్తి బోధాశ్రవణం వలన మనస్సు యొక్క మలదోషం, మననం వలన విక్షేప దోషం, నిధిద్యాసన వలన ఆవరణదోషం రహితం అవుతాయి. అయితే ఉత్తమాధికారికి శ్రవణం వలనే అన్నిదోషాలు రహితం అవుతాయి. అర్జునుడు, పరీక్షిత్తుడు శ్రవణం ద్వారానే అన్ని దోషాలను రహితం చేసుకుని తరించారు. శ్రవణం అనేకాగ్రంగాకాని, శూన్యాగ్రంగా గాని చేస్తే ఫలితం ఉండదు. ఏకాగ్రంగా చేయాలి. బుద్ధి మొనదేలి యున్నవాడు ఉత్తమాధికారి. మధ్యమాధికారి బుద్ధి మొనతేలి యుండక మొద్దుబారి ఉంటుంది. కాబట్టి శ్రవణంతో బాటు మననము, నిదిద్యాసనము అవసరం. మందబుద్ధిగలవాడు ఎంత శ్రవణం చేసినా నిరుపయోగమే.

- సశేషం

**శ్రీసద్గురు ప్రసాదిత (50వ,) సర్ణోత్సవ శ్రీరాధాకృష్ణ జన్మాష్టమి మహోత్సవములు**
**శ్రీ సద్గురు భాగవత, అఖండనామ సప్తాహ, త్రయాహ్నిక సాధుధర్మ సమ్మేళన**
**సర్ణోత్సవ కార్యక్రమాలు**

***స్వస్తి శ్రీ చాంద్రమాన శ్రీ విజయనామ సంవత్సర శ్రావణ బహుళ సప్తమి అనగా ది.27-8-2013 మంగళవారం నుండి 2-9-2013 సోమవారం వరకు సప్తాహ దీక్షతో శ్రీకాశీవనాశ్రమము నందు పూజా కార్యక్రమములు జరుపబడును. కావున ఏవన్మంది భక్తులు కార్యక్రమములో పాల్గొని తరించవలసినదిగా కోరుతున్నాము.***

<u>కార్యక్రమములు</u>

సప్తాహ్నిక శ్రీకృష్ణ మూలమంత్ర హోమము, త్రయాహ్నిక సాధుధర్మ సమ్మేళనము, అఖండ సప్తాహ్నిక హరేరామ నామము, భాగవత ప్రవచనము, భగవద్గీతా పారాయణ ,మాతాజీవారిచే దివ్య అనుగ్రహ భాషణ ఉంటాయి.

2-9-2013న పూర్ణాహుతి, శ్రీరాధాకృష్ణుల సహస్రనామపూజ, శ్రీసద్గురుపాదపూజ జరుగును.

# ఈ జన్మలోనే దైవదర్శనం

- మల్లీప్రియ

(1981లో గుంటూరులోని భారతీయ విద్యాభవన్‌లో జరిగిన సత్సంగ సమావేశంలో శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వరప్రసాద బాబూజీ మహరాజ్‌వారి దివ్యబోధ.)

"నాదీ ఒక వ్యాపారమే. ఏ వ్యాపారస్థుడైనా లాభం వస్తే సంతోషిస్తాడు. నా వ్యాపారం భక్తినివేదన. ఏ కొద్దిమంది భగవంతునివైపు మళ్ళి జీవితం పునీతం చేసుకున్నా, నా వ్యాపారంలో లాభం వచ్చినట్లే సంతోషిస్తాను. మీరు నిజ జీవితంలో ఏ పని చేసేవారైనా సరే, భక్తిమార్గమనే ఈ పెట్టుబడి లేని వ్యాపారానికి వచ్చి, భగవంతుని దర్శనమనే లాభాన్ని పొందండి.



మానవ జీవితానికి లక్ష్యం ఒక్కటే. అదే భగవద్దర్శనం. ఈ జన్మలోనే మనం భగవంతుణ్ణి దర్శించవచ్చు. నేను మిమ్మల్ని చూస్తున్నట్లు, మీరు నన్ను చూస్తున్నట్లు మనం భగవంతుణ్ణి చూడవచ్చు. దీనికి గ్రంథ పఠనం అంతగా ఉపకరించదు. ఎన్ని గ్రంథాలు చదివినా ఒకొక్కడు అజ్ఞానిగానే ఉంటాడు. కనుక మనకు కావలసింది భక్తి ఒక్కటే అని గ్రహించాలి. తిరిగి మనం జన్మ ఎత్తకుండా ఈ జన్మలోనే భగవంతుణ్ణి దర్శించాలి. ఈ భక్తి మార్గంలో మనకు సద్గురువులే మార్గదర్శకులు.

భక్తికి కులం లేదు, మతం లేదు, ధనిక, దరిద్ర భేదం లేదు. దీన్ని పొందటానికి అందరూ అర్హులే! అయితే కావలసిన అర్హత ఒక్కటే! భగవంతుని కొరకు సర్వం త్యజించి, ఆయన పాదారవిందాలకు కానుకగా సమర్పించాలి.

భగవన్నామం జపించటానికి ఏ నియమాలూ అక్కర్లేదు. దైవ ప్రార్థనకు తీరిక లేదని ఎందరో ఆఫీసర్లు, వ్యాపారస్థులు అంటూ ఉంటారు. ఇది శుద్ధ పొరపాటు. సిగరెట్ కాల్చటానికి, కాఫీ తాగటానికి టైమ్ ఉన్నప్పుడు, దైవ ప్రార్థనకి టైమ్ ఎందుకు ఉండదు? శ్రీరామకృష్ణ పరమహంస చెప్పినట్లు స్నానం చేసినా, చేయకపోయినా, ఏ స్థితిలో ఉన్నా కూడా భగవన్నామం స్మరించవచ్చు.

గృహస్థులు వారి వారి పని ఒత్తిడిలో ఉంటారు. కానీ వారి పనులు మానక్కర్లేదు. పనులు చేసుకుంటూ కూడా భగవన్నామం జపించవచ్చు. అప్పుడిక టైమ్ లేకపోవటమనే సమస్యే లేదు.

సిగరెట్లు తాగేవారు 'రామ!' అంటూ పొగ పీల్చండి, తిరిగి 'రామ!' అంటూ పొగ వదలండి. మీరాబాయి కృష్ణ నామంతో విషం తీసుకున్నా అది అమృతంగానే మారింది. సిగరెట్ వల్ల ఊపిరితిత్తులు పాడవకుండా 'రామ' నామం రక్షిస్తుంది.

కొన్నాళ్ళకు సిగరెట్ కన్న రామ నామం మిన్న అని మీరే గ్రహిస్తారు. అప్పుడు సిగరెట్ అవతల పారేస్తారు. ఇక రామనామమే మీకు మిగులుతుంది.

మీరు భోజనం చేసినా, టిఫెన్ తిన్నా, కాఫీ త్రాగినా ప్రతిదానినీ భగవంతునికి అర్పించి, భగవన్నామం జపిస్తూ తినండి. ఇడ్లీ ముక్క తుంచి నోట్లో పెట్టుకుంటూ 'రామ' అనుకోండి. మరో ముక్క నోట్లో పెట్టుకుంటూ 'నారాయణా!' అనుకోండి, లేదా 'అమ్మా!' అనుకోండి. 'అమ్మా!' అంటే శక్తి. మనం బ్రతకాలంటే శక్తి కావాలి. ఆ శక్తే జగజ్జనని.

తిరుపతి వెళ్ళేవారిలో అనేక రకాల మనుష్యులు ఉంటారు. ఏడుకొండలు చేరుకుంటాం. తిరుమల వేంకట రమణుని ఆశ్రయించాలని భావిస్తాం. తీరా గర్భగుడిలోకి వెళ్ళి స్వామివారిని చూడగానే ఒకొక్కక్కరి భావన ఒకొక్కరకంగా ఉంటుంది.

స్వామిని దర్శించేవారిలో ఒక శిల్పి ఉంటాడు. అతడి దృష్టి ఎంతసేపూ స్వామి విగ్రహం ఏ శిలతో చేయబడినదనే విషయం మీదనే ఉంటుంది.

స్వర్ణకారుడు ఉంటాడు. వాడి దృష్టి స్వామి ఆభారణాలమీదనే ఉంటుంది. ఈ నగ చాల బాగుంది. ఎంత ఖరీదు ఉండి ఉంటుందో? అంతా బంగారమేనా? ఇలా అనుకుంటాడు.

ఇక దొంగ ఉంటాడు. వాడి దృష్టి స్వామిపై కాక, పక్కవారి మీద ఉంటుంది. ఎవరూ చూడకుండా ఇది ఎలా తస్కరించాలా? అని.

కష్టాలలో ఉన్నవాడి దృష్టి ఇంటి వద్ద అబ్బాయికి ఎలా ఉందో? తగ్గినదో లేదో? ఇలా అనుకుంటాడు.

అయితే భక్తుడి దృష్టి మాత్రం తిరుమల వాడిని చూడగానే తనను తాను మర్చిపోతాడు. స్వామి దివ్య మంగళ విగ్రహాన్ని చూడగానే ఆనంద తన్మయుడవుతాడు.

అందరూ మానవులే. కాని వారి వారి భావాలు వేరుగా ఉన్నాయి. ఒక్క భక్తుడు మాత్రమే భావానికి అతీతుడు. కనుక మనకు కావలసినది భక్తి. మనం మారవలసినది భక్తులుగా మాత్రమే.

'మానవుడు' అనే మాటలో రెండవ అక్షరం 'న' తొలగించి, దాని స్థానంలో 'ధ' చేర్చండి. అప్పుడు అది 'మాధవుడు' అవుతుంది. కనుక భక్తి సాధనలో మానవుడు తుదకు మాధవుడు లో కలిసిపోయి, తన స్వరూపాన్నే కోల్పోతాడు.

ఈ జన్మలోనే భగవంతుడిని దర్శిద్దాం. దానికి కావలసినది ఒక్క భక్తిమాత్రమే. అందుకు ఏపని చేస్తున్నా అనుక్షణం భగవన్నామాన్ని జపించండి.

అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యాలను ప్రసాదించి భగవంతుడు సర్వదా రక్షించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

గతసంచిక తరువాయి

# భగవంతుని ఆశీర్వదించిన ఆళ్వారు

- సుషుమ్న ప్రసాద

ఆ దేవాలయానికి సమీపించేసరికి విష్ణుచిత్తుడు గగన మార్గాన లక్ష్మీదేవితో కూడిన శ్రీమన్నారాయణుడు ఎంతో రాజసంగా గరుడవాహనుడైన ఆదిదంపతుల అద్భుత దృశ్యాన్ని దర్శించాడు. కన్నులు మిరుమిట్లు గొలిపే దివ్యదంపతుల అద్భుత దర్శనముతో విష్ణుచిత్తుడు పరవశించాడు. ఒక తృటికాలం తన దృష్టిదోషం సోకిందేమోనని ఆశ్చర్యానికి లోనయ్యాడు. వెంటనే భగవంతునికి మంగళశాశనం వంటి పద్యాల తోరణం ఆయన కంఠం నుండి వెల్లివిరిసింది. 'పళ్ళాండు పళ్ళాండు, పళ్ళయిరతాండు, పళ్ళయిరతాండు పలకోటి నూ రాయిరమ్ పళ్ళాండు' (నీవు లక్ష్మి సమేతుండవై శతకోటి వర్షాలు వర్ధిల్లుదువు గాక!) అంటూ శ్రీమన్నారాయణుని మహిమను, వైభవాన్ని కీర్తించాడు. అప్పటి నుండి విష్ణుచిత్తుడు పెరియ ఆళ్వారుగా ప్రసిద్ధి చెందాడు. అంటే శ్రీమన్నారాయణుని నిరుపమాన భక్తులైన ఆళ్వారులందరిలో అగ్రజుడు (పెద్ద) అని అర్థము.

పెరియ ఆళ్వారు శ్రీవిల్లీపుత్తూరుకువచ్చి స్వామి వటపత్రశాయి సేవ కొనసాగించాడు. బాలకృష్ణుని వైభవోపేతమైన, మహిమాన్వితమైన లీలను వర్ణించే 473 పద్యాలతో కూడిన పద్యమాలికను రచించాడు. తన్ను యశోదాదేవిగా భావించుకుని, ఆ పద్యాల ద్వారా బాలకృష్ణుని చిలిపి చేష్టలను, దివ్యలీలను స్మరిస్తూ పరవశించేవాడు. ఆ పదమాలిక నాలాయిర దివ్యప్రబంధములో భాగమై ప్రకాశించింది.

పరమాత్మ సేవకులైన వారి పవిత్ర సాంగత్యము కొరకు బలీయమైన కోరిక ఉన్న విష్ణుచిత్తునకు ఒకరోజు తులసీవనంలో పసిపాప దొరికి, ఆ కోరిక సఫలీకృతమైంది. ఆ పాపకు 'గోద' అని నామకరణం చేసి, మహాలక్ష్మి ప్రతిరూపమనే భావనతో గారాబంగా పెంచాడు. ఆమె కృష్ణునిపై ప్రగాఢమైన భక్తిని పెంపొందించుకుని, ఆ దివ్యనాధుని తప్ప మరెవరినీ వివాహమాడనని ఆరూఢంగా చెప్పింది. విష్ణుచిత్తుడు యిది అసాధ్యమని చెప్పినా ఆమె తన నిర్ణయాన్ని మార్చుకోలేదు.

ఆమె తిరుప్పావై అనే మహా ప్రబంధాన్ని రచించింది. అది దివ్య ప్రబంధములో భాగము. చివరకు శ్రీరంగనాధుడైన రంగనాధ స్వామి పెరియ ఆళ్వారుకు స్వప్నములో ప్రత్యక్షమై గోదాదేవిని శ్రీరంగమునకు తీసుకు రమ్మని ఆజ్ఞాపించాడు. ఆ పవిత్ర క్షేత్రం చేరుకోగానే దేవాలయంలో గోదాదేవి నుండి ఒక దివ్యజ్యోతి ప్రస్ఫుటమై శ్రీరంగనాధ స్వామిలో లీనమయింది. విష్ణుచిత్తుడు నిస్పృహకు లోనైతే శ్రీరంగనాధస్వామి ఓదార్చి, "విష్ణుచిత్తా! నీ పుత్రిక యిప్పుడు నా యిల్లాలు అందుచేత మీరు నా మామగారు" ఆ ఓదార్పు వాక్కులు విని, స్వామి కృప ఆశీస్సులు యినుమడించినందునకానాంద భరితుడయినాడు.

-సశేషం

# భగవంతుని ఉనికి

– జగం

మనం చూసేదే ‘ఉంది’ అనుకోవటం, చూడనిది ‘లేదు’ అనుకోవటం చాలా పొరపాటు. ఈ ప్రపంచం, విశ్వం, సృష్టి ఎంతో ఉంది. అంతా మనం చూశామా? అయినా మనం చూడని ప్రపంచం, విశ్వం, సృష్టి ‘లేవు’ అనదగునా?

మనకు మన తాత తెలియవచ్చు, ముత్తాత తెలియవచ్చు. అంతకు మించి తాతకు తాత, ఆ పైన మనం చూడటం మనకు తెలియటం కష్టం. మనం చూడకపోయినా, మనకు తెలియకపోయినా వారు ఉన్నారు కదా! వారు ఉన్నారని మనం విశ్వసిస్తాము కదా! వారు లేకపోతే మనం ఎక్కడి నుంచి వచ్చాం? అసంభవం! మనకు తెలియనివారు, మనం చూడనివారు ‘లేరు’ అని అనుకోవటం లేదుకదా! అలా అనుకోవటం సమంజసం కాదుకదా. అలాగే భగవంతుడు.

ఇప్పుడు గాని, ఒకప్పుడు గాని, ఉన్నటువంటి విషయాల గురించే మనం మాట్లాడుకోగలం. లేని విషయాల గురించి ఎలా మాట్లాడుకుంటాం? మనం ఏదైనా విషయం గురించి మాట్లాడుకుంటున్నామంటే దాని గురించి. మనకు వినికిడిగా గాని, చూపుద్వారాగాని, జ్ఞానంద్వారాగాని ఎంతోకొంత తెలిసిఉండాలి. ‘భగవంతుడు’ అనే పదం ఉంది. అంటే భగవంతుడు ఉన్నాడని అర్థం. భగవంతుడు లేకపోతే ఆ పదమే అవసరం లేదు కదా! శాస్త్రజ్ఞులు ఎన్నెన్నో కొత్త గ్రహాలను, నక్షత్రాలను, కొత్త సూర్యమండలాన్ని కనుగొన్నారు. వారు వాటిని కనుగొన్నది నేడే అయినా అవి నిన్నా ఉన్నాయి, మొన్నా ఉన్నాయి. భవిష్యత్తులో ఇంకా ఎన్నిటినో కనుక్కోవచ్చు. రేపు కనుగొన్నది నేడు లేదు అనగలమా? పగలు నక్షత్రాలను చూడలేము. రాత్రి సూర్యుణ్ణి చూడలేము. అయినంతమాత్రాన అవి లేవనగలమా?

ఉషశ్రీ గురించి తెలియని రేడియో శ్రోత ఉండరంటే అతిశయోక్తి కాదు. రామాయణ, మహాభారతాల పై శ్రోతల ధర్మసందేహాలకు వారు చక్కటి సమాధానాలు చెప్పేవారు. వారు ఒకసారి ఒక సభలో భగవంతుడు, భక్తి గురించి ఉపన్యసిస్తున్నారు. ఇంతలో ఒక వ్యక్తి లేచి, “మీరింతసేపూ భగవంతుడి గురించి మాట్లాడుతున్నారు. అసలు మీరు భగవంతుణ్ణి చూశారా?” అని అడిగాడు. దానికి ఉషశ్రీ ఎంతో సౌమ్యంగా “మీ తల్లిగారి పేరేమిటి?” అని అడిగారు.

“వెంకాయమ్మ” అని చెప్పాడావ్యక్తి.

“మీరు చెప్పే వెంకాయమ్మే మీ తల్లిగారు అని మీకు గ్యారెంటీగా తెలుసా?”

ఆ వ్యక్తి ఖంగు తిన్నాడు. “తెలుసు” అన్నాడు.

“ఎలా తెలుసు?”

“అమ్మమ్మ, తాతయ్య వంటి బంధువుల ద్వారా తెలుసు”

"మీకు తెలియకపోయినా, మీకు జన్మనిచ్చిన స్త్రీని పెద్దలు చెప్పినదానినిబట్టి, వారిని విశ్వసించి, తల్లి అని నమ్ముతున్నారు. అలాగే నాకు పెద్దలు, పండితులు, 'భగవంతుడు ఉన్నాడు' అని చెప్పారు. నేను నమ్ముతున్నాను. మీకు అభ్యంతరం ఏమిటి?" అని అడిగేసరికి ఆ వ్యక్తి నిరుత్తరుడయ్యాడు. చెంపలు వాయించుకుని కూర్చున్నాడు.

'భగవంతుడు ఎక్కడ ఉన్నాడు' అనే దానికి చమత్కారంగా చెప్పే చిన్న కథ.

ఒకసారి భగవంతుడు అడవిలో తపస్సు చేసుకుంటున్న ముని వద్దకు వెళ్ళి ఇలా చెప్పుకున్నాడు, "మునీశ్వరా! ప్రతి మానవుడు తనకు నేను దర్శనం ఇవ్వాలని కోరుకుంటున్నాడు. నా విద్యుక్త ధర్మం నేను నిర్వహించాలి. అటువంటప్పుడు వీరందరికీ దర్శనం ఇవ్వటం ఎలా సాధ్యం? నాకు మీరే తగిన ఉపాయం చెప్పాలి." దానికి మునీశ్వరుడు నవ్వుకుని, భగవంతునికి నమస్కరించి, "దేవదేవా! అదేనా నీ బాధ! దానికి ఇంత చింత ఎందుకు? నీవు చడీచప్పుడు లేకుండా, మానవుడికి ఏ మాత్రం తెలియకుండా అతని హృదయంలో ప్రవేశించు. ఇక అతని బాధ నీకు ఉండదు." భగవంతుడు అలాగే చేశాడు.

మానవుడు తనలోనే ఉన్న భగవంతుణ్ణి గ్రహించలేక, చూడలేక, 'ఎక్కడ ఉన్నాడు?' అని భగవంతునికై తన చుట్టూ వెతుకుతూ ఎంతో విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నాడు. భక్తాగ్రేసరుడు ప్రహ్లాదుడు తన తండ్రితో ఏమన్నాడు?
"ఇందుగలడు అందులేడను సందేహంబు వలదు, చక్రి సర్వోపగతుండు ఎందెందు వెదకి చూచిన అందందే గలడు. దానవాగ్రణి వింటే!"

సిక్కుల ప్రథమ గురువు శ్రీ గురునానక్. ఆయన సర్వమత సామరస్యానికి చాల కృషి చేశారు. వారు ఒకసారి మక్కాలో తన కాళ్ళను పవిత్ర మసీదువైపు పెట్టుకుని నిద్రించారు. అది మసీదుపట్ల అగౌరవ చర్యగా భావించి, అక్కడివారు ప్రశ్నించారు. "భగవంతుడు లేని ప్రదేశం ఎటువైపు ఉందో చూపించండి, అటువైపే నా కాళ్ళు పెట్టుకుంటాను" అన్నారు గురునానక్. అభ్యంతరం లేవనెత్తినవారు మారుమాట్లాడలేదు. సృష్టికర్త భగవంతుడు సర్వవ్యాపకుడు. సృష్టే తాను, తనది అయినప్పుడు తానులేనిదెక్కడ?

ఒకచోట నాస్తికమహాసభలు జరుగుతున్నాయి. దానిని నిర్వాహకులలో ఒకరు ఇంటి నుంచి బయలుదేరాడు. దారిలో ఉన్న గుడికి వెళ్ళి, ఆయన ఇలా ప్రార్థించాడు "భగవంతుడా! ఈ సభలను జయప్రదం చెయ్యి." దీని భావమేమి!

సత్యవస్తువైన భగవంతుడు ఎప్పటికీ అన్నింటా. అంతటా ఉన్నాడు, ఉంటాడు. ఉన్నాడన్నవాడికి ఉండటం, లేడన్నవాడికి లేకపోవటం జరుగదు. కావలసినది భగవంతుని ఉనికి మనం గ్రహించాలి. దానికి తగిన బుద్ధిని ఇచ్చేది కూడా భగవంతుడే!

*

# సత్య శోధన

- రమణ ప్రసాద్

(2013 ఫిబ్రవరి 1వ తారీకునుండి నాల్గవ తారీకు వరకు శ్రీబాబు భక్త సమాజ్ వారు సిద్ధార్థ ఆర్ట్స్ కాలేజ్ ఆడిటోరియంలో సాయంత్రం గం।5ల నుండి గం।8 వరకు సత్సంగ సమావేశాలు ఏర్పాటు చేశారు. శ్రీ మాతాజీ వారు చేసిన అనుగ్రహభాషణం సంక్షిప్త వివరణను ప్రచురిస్తున్నాము)

" సత్సంగం అంటే సర్వకాల సర్వావస్థలలో సత్య వస్తువుతో కూడి వుండటం. ప్రతి అణువులో సత్యం ప్రకాశిస్తోంది. సృష్టిని ప్రకాశింప చేస్తోంది. మనం సత్యంతోనే ఉన్నాం. సత్యంలోనే ఉన్నాం. దానిని గుర్తించే అవకాశం ఒక్క మానవ జన్మకే ఉంది. ఆ సత్యాన్ని గుర్తించిన మహాత్ములు ఆశ్రితులను తరింప చేయటానికి ఒక రూపం ధరించి అవతరిస్తారు. అట్టివారే సమర్థ సద్గురువులైన మన గురుదేవులు. వారు కనుమరుగయ్యారు అనుకుంటాం. కాని సర్వ వ్యాపకులైనవారికి కనుమరుగవడం అనేది ఉంటుందా? ఏ పనిలో ఉన్నా సత్యంతో ఉన్నామన్న భావన మనకి లేకపోతే జీవితంలో ఎలా మనగలుగుతున్నాం? సద్గురుదేవులు మనను నడిపిస్తున్నారనే భావనతో వుండటమే ధ్యాన స్థితి. ఆ స్థితిని పొందింపచేసేది, విశ్వాసం, నమ్మకం. మనస్సును ఏకాగ్రత చేసి ఏ పని చేస్తున్నా భగవంతుడే చేయిస్తున్నాడు అనే భావనతో ఉండాలి.

వయస్సు మీరినకొద్దీ రూపం మారుతోంది. కాని మనతో మారనిది ఒకటి ఉంది. దానినే సత్యం అన్నాం. ఆత్మ అన్నాం. భగవంతుడన్నాం. ఇదంతా ఎవరిదై వుంది? ఈ సృష్టిని నడిపించేది ఎవరు? ఆయనే భగవంతుడు అనే వివేక దృష్టి మనకు రావటం లేదు. ఒక రాజుగారు తన వద్ద వున్న వస్తువులను అన్నీ ఒక చోట పెట్టి " మీకు వీటిలో ఏవి కావాలో తీసుకోవచ్చు" అని చాటింపు వేయించాడు. అందరూ విలువైనవన్నీ తీసుకువెళ్తున్నారు. ఇంతలో ఒకామె వచ్చి " ఓ రాజా? ఇవి ఎవరివి? అని అడిగింది. రాజు" ఇవన్నీ నావి" అన్నాడు. "అయితే నువ్వే కావాలి నాకు" అంది. అలాగే మనం ఎవరి అనుగ్రహంతో ఉన్నాం? ఎవరి అనుగ్రహం వల్ల మన జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు పని చేస్తున్నాయి? అని ఆలోచించటంలేదు. గజేంద్రుని మొసలి పట్టుకుంటే ఆ మొసలితో యుద్ధం చేసి అలసిపోయి "ఎవ్వనిచే జనించు జగమెవ్వనియందు లీనమైఎవ్వని యందుడిందు పరవేశ్వరుడెవ్వడు?..." అని చింతించి,"అల వైకుంఠపురములో నగరిలో నగరిలో నా మూల సౌధంబులో..."వున్న నారాయణుని స్తుతిస్తే, ఆ ప్రభువు వెంటనే రాలేదు. ఇక ప్రాణాలు కడగంటే స్థితిలో,"లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె, ప్రాణంబులున్ ఠావుల్ దప్పెను, మూర్ఛ వచ్చె దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్ నీవేతప్ప నితః పరంబెరుగ మన్నింపన్ దగున్ దీనునిన్.." అని ప్రార్థింపగానే లక్ష్మీ నారాయణుడు అక్కడే ప్రత్యక్షమై గజేంద్రుని కాపాడాడు. తండ్రి హిరణ్యకసిపుడు "ఎక్కడుంటాడు హరి?" అని అడిగితే,

ఇందుగల డందు లేడని
సందేహము వలదు, చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే కలడు దానవాగ్రణి వింటే॥ అని ప్రహ్లాదుడు సమాధానం ఇచ్చాడు. ఆ సత్య వస్తువే అన్నిట్లో ప్రకాశిస్తోంది. దానిని తెలుసుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి. మన ప్రయత్నలోపమే కాని ఆయన ఆశీర్వచనం మనకు ఎప్పుడూ వుంటుంది. ఆయన లీలా వైభవాన్ని అన్వేషించి ఆనందించాలి.ఆయనను ఆశ్రయించిన సాధకునిపై ఆయన అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది. మనం త్రేతాయుగంలో రాముడిని, ద్వాపరయుగంలో కృష్ణుడిని తలుచుకుంటే మనస్సు నిర్మలమవటం లేదా? రెండక్షరాల సంపుటియైన రామ. కృష్ణ, అమ్మ, గురు – మనకు ఇష్టమైన నామాన్ని తలిస్తే మనకు ఆ రూపంలో భగవద్దర్శనం కలగటంలేదా? 'అమ్మ' సత్య స్వరూపిణి, గోవింద స్వరూపిణి. అమ్మ అనే పిలుపు అందరికీ అమృతమే. అ– బ్రహ్మ బీజం మ– అమృత బీజం. బ్రహ్మామృతం ప్రసాదించేది అమ్మ. సత్యానికి స్త్రీ, పురుషభేదాలు లేవు.

ఆకాశం అంటే ' స్పేస్'. అది అనంతం. అదేవిధంగా సత్యవస్తువు సర్వవ్యాపకమై ఉంది. మనలో ఆ సత్యవస్తువు ఉండబట్టే మనం కంటితో చూడగలుగుతున్నాం, చెవితో వినగలుగుతున్నాం. సత్యం శరీరంలోనుంచి తప్పుకుంటే దానిని ప్రేత అంటారు. బ్రతికి ఉండగానే ఆ వస్తువుని తెలుసుకోవాలి. ఎప్పుడైతే మనలో అజ్ఞానం తొలిగి మనస్సు నిర్మల స్థితి పొందుతుందో, అప్పుడు సత్యం అవగత మవుతుంది. "అభ్యాసేనతు కౌంతేయ వైరాగ్యేన చ గృహ్యతే॥" అని చెప్పాడు భగవానుడు భగవద్గీతలో. ఈ రెండూ మన దగ్గర ఉన్నాయా? అభ్యాస, వైరాగ్యాలు అలవరచుకుంటే జ్ఞానం మన వెంటపడి వస్తుంది. అలా శ్రద్ధా భక్తులతో శబరి గురుదేవులైన మాతంగ మహామునిని సేవించింది. ఆయన " అమ్మా! నీ తపస్సు తప్పక ఫలిస్తుంది. నీకు రామ దర్శనం అవుతుంది" అని దీవించి శరీర త్యాగం చేశాడు. ఆ నాటినుండి ప్రతిరోజు త్రోవతో పూవులు పరచి, మధురమైన ఫలాలను సిద్ధంగా ఉంచి రాముని రాకకై ఎదురుచూసేది. ఆమె తపస్సు ఫలించి ఆమెకు రామ దర్శనమైంది. రాముడు ఆమెకు కైవల్యాన్ని ప్రసాదించాడు.

ఈదేహం ఏనాటికైనా పోవలిసిందే. "అహంకార మమకారాలలో పడకుండా మాధవుని స్మరిస్తే, 'నేను', 'నాది' అనే భేదం తొలిగి నిన్ను నీవు తెలుసుకుంటావు. ఇది నిజం. ఇదే సత్యం" అని శ్రీగురుదేవులు మనకి ప్రభోదించారు. కాబట్టి సద్గురువును ఆశ్రయించి, వారి బోధా శ్రవణంచేసి ఈ జన్మలోనే తరించే ప్రయత్నం చేయాలి. అట్టి అఖండ భక్తి జ్ఞాన, వైరాగ్యాలను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

*

# చందాదారులకు విజ్ఞప్తి

చందాదారులు కొంతమంది 'సమర్థసద్గురు మాసపత్రిక' తమకు చేరటం లేదని మాకు ఫోన్ చేస్తున్నారు. మేము పత్రిక డిస్పాచ్ చేసేవరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాము. జిల్లావారీగా సార్టింగ్, కౌంటింగ్ చేసి ఇక్కడ గుంటూరు ఆర్.ఎమ్.ఎస్ వారి దగ్గరకు చేరుస్తున్నాము. మాసపత్రిక చదవాలనే మీ ఆసక్తికి ఆనందము, పుస్తకము చేరటంలేదని విచారము కలుగుతున్నవి. గుంటూరు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వారిని సంప్రదిస్తే వారు 'చందాదారులనుండి మాకు కంప్లయింట్ అందితే మేము ఇన్‌స్పెక్టర్‌ను పంపి తప్పక చర్య తీసుకోగలము' అన్నారు. కావున చందాదారులు మాకు అందలేదని ఫోన్‌చేస్తే మేము మరొక పుస్తకము మీకు పంపగలము. కానీ పత్రిక మీకు సక్రమంగా చేరాలంటే మీరు వెంటనే మాకు కంప్లయింట్ ఈ క్రింది విధంగా రాసి పంపగలరు............

సమర్థ సద్గురు తెలుగుమాసపత్రిక యాజమాన్యం వారికి -

నేను .........**AS NO**..,.. లేదా **LM NO.** .......... గల చందాదారుడను. ........ నెల పత్రిక మాకు అందలేదు. కారణము తెలియదు. ఇక్కడ మా పోస్ట్‌మాన్ ..........పోస్ట్‌మాస్టర్ ........ పోస్ట్ ఆఫీస్ బ్రాంచ్ .........వారిని సంప్రదించగా మాకు ఈ క్రింది విధంగా సమాధానం చెప్పినారు..... ....... మాకు మిగిలిన ఉత్తరములు సక్రమముగానే అందుచున్నవి. కావున గుంటూరు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వారికి ఫిర్యాదు చేయవలసినదిగా కోరుచున్నాము.

నా అడ్రస్ పూర్తి వివరములతో.............

పేరు ........ **AS NO** లేదా **LM NO**.........

ఇంటి నెం........ వీధి పేరు......... గ్రామం పేరు...... జిల్లా......

పిన్ కోడ్ నెం........ ఫోన్ నెం. సెల్...... లాండ్‌లైన్ నెం............

## గమనిక

మీ చందా ఏ తేదీ వరకు ఉన్నదో తెలియజేస్తూ సమర్థ సద్గురు పత్రిక కవర్ మీద వ్రాస్తున్నాము. దానిని గమనించి మీరు సకాలంలో మీ చందా రెన్యూ చేసుకున్న యెడల మీకు నిరాటంకంగా పత్రికను పంపగలము. చందాను ఈ క్రింది ఎడ్రస్‌కు పంపగలరు. బ్యాంక్ డ్రాఫ్ట్స్ A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్ట్స్ పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్,

నంబూరు పోస్ట్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, గుంటూరు జిల్లా

# శ్రీసద్గురు పుణ్యారాధన రజతోత్సవ వేడుకలు
## అందరూ ఆహ్వానితులే

శ్రీసర్వాధిష్ఠాన చైతన్య విశ్వమత ప్రవక్త సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీవర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి రజతోత్సవ పుణ్యారాధనములు కాళీవనాశ్రమ పీఠాధిపతి పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీప్రసాద మాతాజీ వారి ఆధ్వర్యంలో శ్రీకాళీవనాశ్రమం (శ్రీకాళీగార్డెన్స్), నంబూరులో ది. 20-11-2013 బుధవారం నుండి ది. 1-12-2013 ఆదివారం వరకు పంచయజ్ఞ విధులతో జరుపబడును. నిత్యమూ శ్రీగురుగీతా ప్రచనము, శ్రీసద్గురు శతసహస్ర నామార్చనలు, మహామంగళ హారతులు ఉంటాయి. డిసెంబర్ 1వ తేదీ ఉదయం మహాభిషేకం, మహామంగళహారతి, దీక్షావిరమణ.

విశేష కార్యక్రమాలు -

నవంబర్ 20 నుండి బ్రహ్మశ్రీ కొండూరి రామబ్రహ్మంగారి ఆధ్వర్యంలో హెూమము జరుగును.

నవంబర్ 24, 25, 26 తేదీలలో సాధుధర్మ సమ్మేళనము.

నవంబర్ 27న యతి పూజలు.

ఈ ఉత్సవాలలో అఖండ హరినామ సంకీర్తన, సామూహిక సద్గురుపాద పూజలు, నౌకావిహారము, ఊంజల సేవ, నగరోత్సవములు ఉంటాయి.

ఈ కార్య క్రమాలలో ప్రతి భక్త హృదయము పాల్గొనాలని మా ఆకాంక్ష. ఈ కార్యక్రమాలలో పాల్గొనుటకు వీలుగా శలవు పెట్టుకునేందుకు ముందుగా తెలియచేయుచున్నాము.

వివరములకు -

ట్రస్ట్ కార్యాలయము - 0863 2293564

కుమారస్వామి రాజా - 93465 35357

మురళీమోహనవర్మ - 93983 34345

ఎ. కుమారస్వామి - 93945 35357

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి

- విజయేశ్వరానంద ప్రసాద్

## చిరంజీవిరాజుగారితో శ్రీబాబు

కొండంత సంతోషంతో రాజుగారు, ఆలస్యం చేస్తే శ్రీబాబు వెళ్ళిపోతారేమో అని, కొంత డబ్బు జేబులో కుక్కుకుని, ఉన్నపళంగా బట్టలు కూడా మార్చుకోకుండా బయలుదేరేవారు. తీరా ఏలూరు స్టేషన్‌కు వెళ్ళాక బెజవాడకో, గూడెం వరకో టిక్కెట్లు తీయించి, అక్కడ దిగి శ్రీబాబు "ఈ దగ్గరలోనే నేను నా పనులు చూసుకుని వచ్చేస్తాను నువ్వు వెళ్ళు" అనేవారు. ఇంక పట్టుబట్టటం భావ్యం కాదని రాజుగారు, స్వామి ఎంతో దూరం వెళ్ళవచ్చు అని భావించి, 'మీరు కొంతైనా పైకం తీసుకుంటేకాని నేను వెళ్ళను' అని బ్రతిమిలాడేవారు. "అయితే నాకు డబ్బు వద్దు, విశాఖపట్నానికో, మాద్రాసుకో టిక్కెట్టు కొని ఇవ్వు చాలు" అని, టిక్కెట్టు కొనిపించి, రాజుగారిని వెనక్కు పంపటానికి శ్రీబాబు చాల శ్రమపడవలసి వచ్చేది.



శ్రీబాబు వెళ్ళిపోతుంటే, ఆవు పొదుగు నుంచి విడదీసిన దూడవలె ఉండేది రాజుగారి పరిస్థితి. శ్రీబాబుకు ఎదురు చెప్పలేక, ఆయన్ను విడచి వెళ్ళలేక గుడ్ల నీరు కక్కుకుంటూ, శ్రీబాబును తీసుకువెళ్ళే రైలు వంక దిగులుగా చూస్తూ వెనక్కి వెళ్ళేవారు.

రాజుగారు తమకు పంచెలు, లాల్చీలు, కళ్ళజోళ్ళు, పాదరక్షలు ఏవి కొనుక్కుంటే అవి శ్రీబాబుకు కూడా కొనేవారు. బాబు వద్దన్నా వినేవారు కాదు. తమకు ఏది నచ్చితే అది గురుదేవులకు కొనవలసినదే. తమ గురుదేవులు పెద్ద పెద్ద జరీ అంచు పంచెలు కట్టుకుని దర్జాగా, రాజాధిరాజులాగ ఉండాలని ఆయనకోరిక.

"చిరంజీవీ! ఇవన్నీ నాకెందుకయ్యా? సర్వసంగ పరిత్యాగం చేసినవాడికి. నీలాంటి క్షత్రియ పుంగవులకు తగినవి ఇవన్నీ" అనేవారు శ్రీబాబు. 'క్షత్రియ ధర్మం ఏమిటి బాబూ?' అని రాజుగారు శ్రీబాబుని అడిగారు. "శత్రువులను జయించి, స్వధర్మం నిలుపుకోగలిగినవాడే క్షత్రియుడు" అన్నారు బాబు. 'తనను ఎదిరించే బయట శత్రువులను జయించగలిగినవాడు క్షత్రియుడైతే, మరి తన లోపల ఉన్న బలమైన ఆరుగురు శత్రువులు ఉంటారు అని తమరు చెబుతారుకదా! వారిని

జయించిన వాడిని ఏమంటారు?' అని రాజుగారు అడిగారు. "సుక్షత్రియుడు, జితేంద్రియుడు అంటారు" అన్నారు బాబు దరహాసంతో.

'సర్వసంగ పరిత్యాగం చేసిన తమరు జితేంద్రియులు, సుక్షత్రియులు, యోగీశ్వరులు. తమరు ఈ వస్త్రాభరణాలు ధరిస్తే వాటికి సార్థకం కలుగుతుంది. అప్పుడు అవి జ్ఞాన వస్త్రాలు అవుతాయి. కనుక తమరు వాటిని ధరించి, జ్ఞానవస్త్రాలుగా చేసి, నాపై పరమానుగ్రహంతో నన్ను ఆ జ్ఞానవస్త్రాలను ధరించే యోగ్యతగల సుక్షత్రియునిగా చేయండి బాబూ!' అన్నారు.

పరమ ప్రసన్నులైన శ్రీబాబు "ఇప్పుడు నిజంగా నీవు నావాడవైనావు. ఇంద్రజిత్తు ఇంద్రుణ్ణి జయించాడు గాని, ఇంద్రియాలను జయించలేక పోయాడు. పతనం తప్పలేదు. కాని హనుమంతుడో! బాహ్యేంద్రియాలను, అంతరేంద్రియాలను కూడా జయించి, జితేంద్రియుడై, సుక్షత్రియుడైన యిక్ష్వాకు కులదీపకుడైన శ్రీరామ చంద్ర ప్రభువు పరమానుగ్రహానికి పాత్రుడైనాడు. అలాగే నీవు కూడా జితేంద్రియుడవై, సుక్షత్రియుడవై, జగన్మాత పరమానుగ్రహానికి పాత్రుడవు అగుదువుగాక!" అని ఆశీర్వదించారు. తమ చరమ జీవితంలో శ్రీగురుదేవుల యీ ఆశీస్సులను సార్థకం చేసుకుని చరితార్థులైనారు చిరంజీవిరాజుగారు.

రాజుగారి దృష్టిలో భగవంతుడు ఎక్కడో లేడు. శ్రీబాబే ఆయనకు ఇలవేల్పు, దైవము, తరగని పెన్నిధి. ఆ పెన్నిధి తనకు లభించిన రాజుగారుకి అశాశ్వతములు, దుఃఖతమములు అయిన తన భోగభాగ్యాలపైన విరక్తి కలిగింది. ఇక ఈ లోకంలో తనకు ఉన్నదంతా శ్రీబాబుదే అంటూ, తనదంటూ ఏమీ లేదంటూ దృఢ నిశ్చయంతో రాజుగారు తన యావదాస్తిని శ్రీబాబు చరణసన్నిధిలో సమర్పించాలి అనుకున్నారు. రాఘవమ్మగారు, శేషమాంబగారు కూడా ఆ ఆలోచనను మనసారా బలపరిచారు.

రాజుగారికి కొండంత ధైర్యం వచ్చింది. ధైర్యం చేసి ఈ విషయం బాబు వద్ద మనవి చేసుకున్నారు. ఆకుటుంబ సభ్యుల త్యాగ నిరతికి, నిశ్చల భక్తికి, నిరపేక్షకు ముగ్ధులైపోయారు బాబు. ఎంతో ప్రేమతో "మీరంతా నన్ను గురించి ఏమని భావించి యిలా చేద్దామనుకున్నారు?" అని అడిగారు. 'మా మేలు కోరే ఏకైక బంధువు, అవసరంలో ఆదుకొనే మిత్రుడు, ఆపదలో కాపాడే దైవము, తరింపజేసే గురువు అన్నీ మీరే అని మేము చిత్తశుద్ధిగా నిర్ణయించుకున్నాము బాబూ! ఈ ఆస్తిపాస్థులు, భోగ భాగ్యాలు, మా తనుమనోధనాలు అన్నీ మీరు ప్రసాదించినవేగా బాబూ!' అన్నారు వాళ్ళు

– సశేషం

# శ్రీ రాధా మాధవ రస సుధ

– శ్రీ హనుమాన్ ప్రసాద్ పోద్దార్

హే వ్రజ రాజకుమారా! నా వినీత విజ్ఞప్తి విను
యుగయుగాలకూ జన్మజన్మలకూ నీవే నా జీవనాధారమగుము,

నందకుమారా! నీ పదపంకజ పరాగాన్ని ఆస్వాదించే తుమ్మెదగా నన్ను
ఉండనిమ్ము.



తరుణ తమాల వృక్షాన్ని అల్లుకున్న కనకలత
వలే నిన్నే సదా ఆశ్రయించుకుని
ఉండనిమ్ము
నీ చరణములకు ప్రాణాలు అర్పించుకుని,
నేను నీకు నిత్యదాసినైపోతిని, ప్రేమ దామంతో
నీ చరణాలకు బంధితమై నా ప్రాణాలు
అత్యంత ధన్యమయ్యాయి.

ఈ త్రిభువనాలలో చూడగా నావాడు నీవు
తప్ప వేరెవరూ లేదు.
'రాధా!' అని మరెవరు పిలుస్తారు? నేను
మరెవరి వంక చూస్తాను?

ఈకులం, ఆకులం, రెండు కులాల్లోను, గోకులంలోనూ నా వారెవరు?
నీ అరుణ మృదుపద కమలాల్ని అనన్యశరణ్యంగా పొంది మౌనయినాను.

నిన్ను చూడనిదే ఒక్క క్షణం కూడా నాకు శాంతి లేదు.
నీవే నా నిత్య ప్రాణనాధుడవు. నా మనస్సులోని మాటను ఎవరికి వినిపించను?

నేను రూప శీల గుణ హీననని నీవు ఎంతైనా చీదరించు
నీ చరణధూళిని, నిరంతరం నీ చరణాశ్రితగానే ఉంటాను.

నీ రాధ

విఠ్ఠ  కధలు

గతసంచిక తరువాయి

-రమణ ప్రసాద్

# జ్ఞానదేవుడు

***జ్ఞానదేవుడు 'జ్ఞానేశ్వరి', 'అనుభవామృతము'లను గ్రంథములను రచించుట.***

జ్ఞానదేవులవారు, నివృత్తి, సాపోన్, ముక్తాబాయిలతో కలసి తీర్థయాత్రలకు బయలుదేరారు. పండరీపురంలో సదా నామ సంకీర్తనంతో తన్మయత్వం చెందే పాండురంగ భక్తుడు నామదేవుని దర్శించి అతనితో కలిసి తీర్థయాత్రలు చేయాలని సంకల్పించారు. చంద్రభాగానదిలో స్నానంచేసి విఠలనాథుని పవిత్రాలయానికి వచ్చి ఆలయద్వారంలో నిలబడగానే జ్ఞానదేవులు పారవశ్యంలో ఒక కీర్తన గానం చేసారు.



దేవాచియాద్వారీ। ఉభేక్షణ భరీ
తేణే ముక్తిచారీ। సాధియేలా
హరిముఖేమ్హ్వణా। హరిముఖేమ్హ్వణా।
పుణ్యాచీగణనా। కొణకరీ
అసానీ సంసారీ। జహ్వేవేగు కరీ
వేదశాస్త్ర ఉభారీ బాహ్యనదా
జ్ఞానదేవమ్హ్వణే వ్యాసాచియా ఖుణే
ద్వారకీ చారాణా। పాండవాఘరీ ॥

"పాండురంగ ఆలయమందు ఎవ్వరైనా ఒక్క క్షణం నిలబడితే చాలు. వారు సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్య ముక్తులను పొందగలరు.

హరినామాన్ని స్మరించు. హరినామాన్ని కీర్తించు. భగవన్నామాన్ని చేసికొన్న వారి పుణ్యాన్ని ఎవరు లెక్కించగలరు? ప్రపంచంలో ఉండి మనుగడ సాగిస్తూ,నువ్వు నీ కర్తవ్యం చేస్తూ భగవన్నామం చెయ్యి. ధర్మమార్గంలో పయనించు. పాండవుల భక్తికి లొంగి భగవంతుడు వారికి ఎలా సేవచేశాడో నీకు తెలియదా?" అని జ్ఞానదేవులు చేసిన గానానికి నామదేవులవారు ఆనంద భాష్పాలు రాల్చారు. భక్తమండలి అంతా పులకాంకితులు అయ్యారు.

భక్తమండలితో అహ్మదాబాద్ జిల్లాలో 'నెవాసే' అనే గ్రామానికి వచ్చారు జ్ఞానదేవులవారు. అచ్చట సచ్చిదానంద బాబా అను నతడు నయంకాని వ్యాధితో

బాధపడటంచూసి జ్ఞానదేవులవారు అతనిని స్పృశించగానే అతని రోగము మటు మాయమైంది. వెంటనే జ్ఞానదేవులవారి పాదములపై పడి శిష్యుడైనాడు.

అక్కడ దేవాలయంలో జ్ఞానదేవులవారు భగవద్గీతపై ప్రవచనం చేయటం ప్రారంభించారు. భక్తులు అసంఖ్యాకంగా హాజరై శ్రవణానందంగా ఆలకించారు. దానిని సచ్చిదానంద బాబా గ్రంథస్థం చేశారు. దానికి "భావార్థ దీపిక" అను నామకరణం చేశారు. ఆ గ్రంథమే తరువాత 'జ్ఞానేశ్వరి' అను పేరుతో వెలువడింది. ఇది మరాఠీలో భగవద్గీతకు వ్యాఖ్యానము. చక్కటి ఉపమానాలతో జ్ఞాన, యోగ, కర్మ, భక్తి మొదలగు యోగములన్నిటినీ సమన్వయం చేస్తూ జ్ఞానదేవులవారు అందించిన ఈ గ్రంథము పరమ పవిత్రమై, ఎంతో ప్రసిద్ధి పొందింది.

ఆధ్యాత్మిక ప్రచారంచేస్తూ ముముక్షువులను సక్రమమార్గంలో నడిపిస్తూ జ్ఞానదేవులవారు అలంది చేరారు. తన సోదరుడు, గురువు అయిన నివృత్తినాధుని ప్రేరణచే అనుభవామృతం అను గ్రంథం రచించారు. ఈ గ్రంథం, సూర్యోదయం అవటంతో ఎలా చీకటి పటాపంచలవుతుందో అలా పాషండ మత భావాలు పటాపంచలయినాయి.

**అమృతానుభవం**

సాధన అనే అరణ్యంలో బ్రహ్మవిద్య వసంతాగమనం వంటిది. ఆ వసంతఋతు ఆగమనం తెలిపేవారు శ్రీ సద్గురుదేవులు. వారు భక్తులను ఉద్ధరించటానికి శరీరం ధరిస్తారు. జనన మరణ వలయంలో చిక్కుకున్న జీవులను తరింపచేస్తారు.

శ్రీ సద్గురు దేవుల కృపా వీక్షణంతో జీవుల అజ్ఞానం అంతరించిపోతుంది. వారికి ఆత్మ తత్త్వం అవగతమవుతుంది. చిన్న, పెద్ద, గొప్ప, బీద అనే భావం లేకుండా శ్రీ సద్గురు దేవులు అందరికి సమంగా మోక్షం అనే సువర్ణాన్ని దానం చేస్తారు. జీవుడు, శివుడు అనే ద్వైత భావాన్ని హరిస్తారు. జీవులకు స్వస్వరూప దర్శన భాగ్యాన్ని ప్రసాదిస్తారు.

శ్రీ సద్గురు దేవుల బోధ షోడశ కళలతో కూడిన చంద్రుని వెన్నెలలా ఉంటుంది. శరణు కోరినవారికి వారి పాద ద్వయం పూర్ణిమ వెన్నెల అయి ప్రకాశిస్తుంది. అన్నిటిని త్యజించి శ్రీ గురుదేవుల శరణాగతి చెందిన వానికి పూర్ణత్వం లభిస్తుంది. అనేక సాధనలు చేసి వేసారిన వారికి శ్రీ గురుదేవు దర్శనంతో శాంతి లభిస్తుంది. ప్రవృత్తి మార్గంలో ప్రవహిస్తూ వచ్చిన జీవనగంగ శ్రీ సద్గురు దేవులు అనే సముద్రంలో లయించి శాంతిని పొందుతుంది. శ్రీ గురుదేవుల దర్శనంతో ఈ ప్రపంచం మిథ్య అని తెలిసిపోతుంది.

శ్రీ గురుదేవుల బోధామృత సుధాంశు కిరణాలు వ్యాపిస్తూనే అజ్ఞానమనే చీకటి తొలగి పోతుంది. ఆత్మానందం సర్వత్రా వ్యాపిస్తుంది.

గురుదేవులు కృపతో నీటివెంట అలలపైన అజ్ఞానం అనే అలలు రాకుండా చేస్తారు. అంతే కాదు శిష్యునికి తాను అల కాదని తాను కూడా సముద్రమే అని నిశ్చయ జ్ఞానం కలిగేలా చేస్తారు. శ్రీ సద్గురు దేవులను ఆలింగనం చేసుకోగానే శిష్యుడు ఏమీ మిగలకుండా ఆయనలో లీనమైపోతాడు.అలా సర్వ సమర్పణ చేసిన శిష్యుడు "అహం బ్రహ్మాస్మి" అను పదమును దాటి ఆవలకు వెళ్ళిపోతాడు. శ్రీ సద్గురు దేవుల పట్ల ఉదాసీనత చేసిన శిష్యుడు గడ్డిపోచ కన్న హీనమైన నీచ స్థితికి దిగజారిపోతాడు.

ఉపాసన సాధనలలో పడ్డ శ్రమ సద్గురుదేవుల అనుగ్రహంతో ఫలిస్తుంది. వేదాంత శాస్త్రం అనేది పెద్ద వనం లాంటిది. శ్రీ సద్గురుదేవుల కృపా దృష్టి అనే వసంతాగమనం కలుగనంతవరకు వేదాంతవనంలో మోక్షం అనే పూవులు పూయవు. శ్రీ గురుదేవుల కళ్ళలో జ్ఞానమనే అంజనం వేయగానే అజ్ఞానం అంతా నిశ్శేషంగా నశించిపోతుంది.

-సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు,ఆశ్రమ స్థిర నివాసులైన శ్రీమతి మావులేటి నారాయణమ్మ గారు 4-2-2013 సోమవారం రాత్రి శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరు గత కొద్ది కాలంగా అస్వస్థులుగా ఉన్నారు. వీరికి ఇద్దరు కుమారులు, కోడళ్ళు, ఒక కుమార్తె, అల్లుడు, మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాండ్రు కలరు. వీరి వయస్సు 87సంవత్సరాలు. వీరికి సద్గురుదేవులు ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL